



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 175 | ది.13-10-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-

VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 175 | Date : 13-10-2026 | Tuesday | Pages : 8 | Rs.1/-


## రేపు ఏపీకి తమిళనాడు సీఎం విజయ్



**అమరావతి,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రేపు ఏపీలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకోనున్న ఆయన, సాయంత్రం 4:15 గంటలకు ఏపీ సీఎం చంద్రబాబుతో సమావేశం కానున్నారు. ఈ భేటీలో పలు కీలక రాజకీయ, అభివృద్ధి అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అనంతరం సాయంత్రం 6 గంటలకు విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని, రాత్రి 8:30 గంటలకు చెన్నైకి తిరుగు ప్రయాణం కానున్నారు.

# తిరుపతి సమగ్రాభివృద్ధికి శ్రీకారం

## తుడా-టీటీడీ చేపడుతున్న అభివృద్ధి పనులకు వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన

- రూ.3,222 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు
- అలిపిరి వద్ద యాత్రికుల టౌన్‌షిప్‌కు శంకుస్థాపన
- మొదలైన మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులు
- టీటీడీ ఉద్యోగుల నివాస లేఔట్ పనుల ప్రారంభం
- వెంకటాద్రి యాప్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు





**అమరావతి, అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన తిరుమల--తిరుపతి ప్రాంతాన్ని మరింత అద్భుతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేలా చేపట్టిన పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, టీటీడీ పరిధిలో రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభిం చారు. తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యాలను కల్పించేందుకు రూ.2,750 కోట్లతో సమీకృత టౌన్‌షిప్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సురక్షితమైన, ఆధ్యాత్మిక అనుభూతిని అందించేలా తిరుపతిలోని అలిపిరి సమీపంలో ఎస్వీ జూపార్కు రహదారి వద్ద సమీకృత యాత్రికుల టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం రూ.2,750 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో వసతి, అన్నప్రసాదం, విశ్రాంతి, రవాణా, పార్కింగ్, వైద్య సేవలు, డిజిటల్ సమాచార కేంద్రాలు సహా భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురానున్నారు. భక్తుల వసతి కోసం రూ.1,332 కోట్లతో నాలుగు బ్లాకుల్లో పది అంతస్తుల చొప్పున మొత్తం 2,700 గదులను నిర్మించనున్నారు. వీటి ద్వారా రోజుకు సుమారు 15 వేల మంది భక్తులకు వసతి కల్పించే అవకాశం ఉంది. తిరుమల కొండపై వసతులపై ఒత్తిడిని తగ్గించడ ంతోపాటు, తిరుపతి లోనే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. అన్నదానం అత్యంత పవిత్రమైన సేవ అని పేర్కొన్న ముఖ్యమంత్రి... ఆకలితో వచ్చిన భక్తులకు అన్నప్రసాదం, అలసిపోయిన వారికి వసతి కల్పించడం ద్వారా దేవదేవుడికి సేవ చేసినట్లేనని అన్నారు. ఇందులో భాగంగా రూ.160 కోట్లతో నిర్మించనున్న అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భక్తులకు ఆహారాన్ని అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపే బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాన్ని నిర్మిస్తున్నారు. రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన సమీకృత రవాణా టెర్మినల్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

**రూ.242 కోట్లతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారులు..** తిరుపతి నగరంలో పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.242 కోట్ల అంచనా వ్యయంతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. మొత్తం 20 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ పనుల్లో తుడా రూ.127 కోట్లతో 16.50 కిలోమీటర్లు, టీటీడీ రూ.115 కోట్లతో 3.60 కిలోమీటర్ల రహదారులను అభివృద్ధి చేయనున్నాయి. ఈ రహదారులు జాతీయ రహదారులు 140, 71 మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడంతోపాటు, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించనున్నాయి. శ్రీవారి సేవలో నిరంతరం నిమగ్నమయ్యే టీటీడీ ఉద్యోగుల కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగులు, వారి కుటుంబాలు సొంతింటిలో ఆత్మగౌరవంతో జీవించాలన్న లక్ష్యంతో 418 ఎకరాల్లో నివాస లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.

# పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం

- రాష్ట్రాభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- కాకినాడ సీఐఐ ప్రాంతీయ సదస్సులో 6,347 కోట్ల రూపాయల పెట్టుబడులకు ప్రోత్సాహం.. 18 వేల మందికి ఉపాధి అవకాశాలు





**కాకినాడ,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. పారిశ్రామికవేత్తలు కేవలం లాభాలకే పరిమితం కాకుండా దేశం, జాతి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, ప్రోత్సాహకాలను వేగంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటోందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ యువతకు ఉపాధి కల్పించాలని సూచించారు. కాకినాడ జేఎన్‌టీయూలో సోమవారం నిర్వహించిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రాంతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు స్థాపించాలంటే పారిశ్రామికవేత్తలు భయపడే పరిస్థితులు ఉండేవని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తే తమకేమిస్తారని అడిగే సంస్కృతి అప్పట్లో ఉండేదని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులను ఆహ్వానిస్తూ.. రాష్ట్రానికి, ప్రజలకు ఏమి చేయగలరనే అంశానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అపార అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆంధ్రప్రదేశ్ పురోగతిలో భాగస్వాములు కావాలని కోరారు.

**6,347 కోట్ల రూపాయల పెట్టుబడులతో కొత్త అవకాశాలు..** కాకినాడలో తొలిసారిగా సీఐఐ ప్రాంతీయ సదస్సు నిర్వహించడం సంతోషకరమని పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖపట్నం తర్వాత రాష్ట్రంలో రెండో ప్రాంతీయ సదస్సుకు కాకినాడ వేదిక కావడం విశేషమన్నారు. ఈ ప్రాంతంలో 6,347 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన కార్యక్రమాలు పారిశ్రామిక ప్రగతికి పునాది వేస్తాయని తెలిపారు. 16 అవగాహన ఒప్పందాల ద్వారా రూ.4,652 కోట్ల పెట్టుబడులు 2,090 కోట్ల వ్యయంతో పూర్తయిన నాలుగు ప్రత్యేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరగడం శుభపరిణామమన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా కాకినాడ, పరిసర ప్రాంతాల్లో సుమారు 18 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. యువతకు ఉద్యోగాలు లభించడంతోపాటు వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు.

**సింగపూర్ అభివృద్ధి మనకు స్ఫూర్తి..** సింగపూర్ ఒకప్పుడు అనేక సమస్యలను ఎదుర్కొన్నప్పటికీ సంకల్పబలం, సమష్టి కృషితో అభివృద్ధి చెందిన దేశంగా నిలిచిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. స్విట్జర్లాండ్ అభివృద్ధి నమూనా కూడా స్ఫూర్తిదాయకమన్నారు. స్పష్టమైన లక్ష్యం, ఐక్యత, జాతీయ భావనతో పనిచేస్తే దేశాన్ని ప్రగతి పథంలో నడిపించవచ్చని తెలిపారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరించేందుకు సిద్ధంగా ఉందని, అవసరమైన అనుమతులు, ప్రోత్సాహకాలను వేగంగా అందిస్తోందని చెప్పారు. పారిశ్రామికవేత్తలు కూడా సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త జంషెడ్జీ టాటా దేశాభివృద్ధికి చేసిన సేవలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. పరిశ్రమలను కేవలం లాభాలు ఆర్జించే మార్గాలుగా కాకుండా, దేశాన్ని ముందుకు నడిపించే సాధనాలుగా చూడాలని అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా సమాజానికి మేలు చేసే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.

# ఫిర్యాదుల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

## -ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, **అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీ ఎస్ నుంచి వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అందుతున్న ప్రభుత్వ సేవలపై ఆరా తీశారు. ప్రస్తుతం పీజీఆర్ఎస్ విధానం ద్వారా ప్రజల సమస్యలను వీలైనంత మేరకు పరిష్కరించగలుగుతున్నామని, మరింత వేగంగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించాలని సీఎస్ సాయి ప్రసాద్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆ సమావేశంలో 175 నియోజకవర్గాల నోడల్ అధికారులు ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత వాటిని పరిష్కరించే విషయంలో ఉద్యోగులకు, అధికారులకు జవాబుదారీతనం ఉండేలా చూడాలన్నారు. వివిధ శాఖలపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని... జారీ చేస్తున్న జీవోలను వక్రీకరిస్తూ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతున్నారన్నారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవోపై ఈ తరహా దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు సమర్థంగా సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కోటి నిధులతో ఆగిరిపల్లి మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం- మంత్రి పార్థసారథి



**ఆగిరిపల్లి, అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** పట్టణాలకు ధీటుగా గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. సోమవారం ఆగిరిపల్లి మండలం కృష్ణవరంలో రూ.80 లక్షలతో చేపట్టనున్న కమ్యూనిటీ హాలు, రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులకు, ఆగిరిపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించనున్న ముదిరాజుల కమ్యూనిటీ హాలుకు మంత్రి భూమిపూజ చేసి శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. మొత్తం రూ.కోటి విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణంతో వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగునీటి పారుదల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. మిగిలిన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కూటమి నాయకులు, సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కొండపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం 'ఎస్సీ మహిళ'కు కేటాయింపు

- ధీటైన ఎస్సీ మహిళా అభ్యర్థుల వేటలో పార్టీలు
- కొండపల్లిలో మొదలైన ఎన్నికల ఉత్కంఠత




**ఇబ్రహీంపట్నం,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ లో మున్సిపల్ ఎన్నికల నగారా మోగడాని కి ముందే స్థానిక సంస్థల రిజర్వేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. రాష్ట్రంలోని 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల చైర్‌పర్సన్ పదవులకు ప్రభుత్వం అధికారికంగా తుది రిజర్వేషన్లను ఖరారు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని మున్సిపాలిటీ అయిన కొండపల్లి చైర్‌పర్సన్ స్థానాన్ని ఎస్సీ మహిళకు కేటాయించారు. జనరల్ అని జోరుగా ప్రచారం జరిగిన చివరికి ఎస్సీ మహిళ గా ప్రకటించడంతో అధికార ప్రతిపక్షాలు ఈ ధీటైన అయిన అభ్యర్థుల కోసం వేటలు ప్రారంభించాయి.

**మొదలైన ఎన్నికల ఉత్కంఠ..** ఈ రిజర్వేషన్ అధికారికంగా ఖరారు కావడంతో కొండపల్లి స్థానిక రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. కొండపల్లి మున్సిపాలిటీ గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన సంగతి తెలిసిందే. ఈసారి చైర్‌పర్సన్ పీఠం ఎస్సీ మహిళకు దక్కడంతో, అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు బలమైన ఎస్సీ మహిళా అభ్యర్థుల అన్వేషణలో పడ్డాయి.

# జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ పీఠంపై ఉత్కంఠ!

- జనరల్ మహిళకు రిజర్వేషన్.. కూటమి, వైసీపీలో ఎవరికి అవకాశం?
- శ్రీరామ్, సామినేని, రంగాపురం కుటుంబాల పేర్లపై చర్చ.. వైసీపీలోనూ పలువురు ఆశావహులు!



వార్తాప్రభ ప్రత్యేక రాజకీయ విశ్లేషణ

**జగ్గయ్యపేట ,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** మున్సిపల్ చైర్మన్ పదవి జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో పట్టణ రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటివరకు పురుష నాయకుల రాజకీయ ఆధిపత్యం చుట్టూ సాగిన చర్చలు ఇప్పుడు మహిళా అభ్యర్థుల ఎంపిక వైపు మళ్లాయి. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు కూటమి, వైఎస్సార్‌సీపీ ఎలాంటి వ్యూహాలను అనుసరిస్తాయన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**కూటమిలో ఆశావహులు ఎందరో.. అభ్యర్థి ఎవరనేది ప్రశ్న!** జగ్గయ్యపేటలో కూటమి తరపున చైర్మన్ అభ్యర్థి ఎంపికపై పలు పేర్లు ప్రచారంలో ఉన్నాయి. శ్రీరామ్ కుటుంబం నుంచి శ్రీరామ్ ధనుంజయ చినబాబు సతీమణి శ్రీవల్లి పేరు వినిపిస్తుండగా, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ సుబ్బారావు కుటుంబం నుంచి కూడా అభ్యర్థి బరిలోకి దిగుతారనే ఊహాగానాలు ఉన్నాయి. మరోవైపు, సామినేని కుటుంబం నుంచి రాజకీయాల్లో చురుగ్గా ఉంటున్న సామినేని ఉదయభాను సతీమణి విమలాబాను పోటీ చేస్తారా? అన్న చర్చ సాగుతోంది. అలాగే మాజీ మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సతీమణి పేరు కూడా తాజాగా తెరపైకి వచ్చింది. ఆమె చైర్‌పర్సన్ అభ్యర్థిగా బరిలోకి దిగుతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇక మాజీ మంత్రి నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్ధన్ వర్గాల నుంచి మాజీ కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి పేరు పరిశీలనలోకి వస్తుందా? అన్నది మరో చర్చనీయాంశం. ఇన్ని పేర్లు ప్రచారంలోకి రావడంతో కూటమి అభ్యర్థి ఎంపిక కీలకంగా మారింది. అయితే వీరిలో ఎవరైనా అధికారికంగా అభ్యర్థిత్వాన్ని ప్రకటించారా? అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

**వైఎస్సార్‌సీపీలోనూ అభ్యర్థి ఎంపికపై ఆసక్తి..** వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ వైస్ చైర్మన్ హఫీ జున్నీసా పోటీకి దిగుతారా? లేక పార్టీ నాయకత్వం మరో మహిళా నాయకురాలికి అవకాశం కల్పిస్తుందా? అన్నది చర్చనీయాంశంగా మారింది. తన్నీరు నాగేశ్వరరావు వర్గం నుంచి, ఇంటూరి చిన్న వర్గం నుంచి అభ్యర్థులు తెరపైకి వస్తారా? కాపు సామాజిక వర్గం నుంచి ఎవరైనా మహిళా అభ్యర్థిగా ముందుకొస్తారా? అన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీలో అభ్యర్థి ఎంపిక విషయంలో స్థానిక నాయకుల అభిప్రాయాలు, పార్టీ అధిష్ఠానం నిర్ణయం కీలకం కానున్నాయి. అయితే ప్రస్తుతం ప్రచారంలో ఉన్న పేర్లలో ఎవరికి పార్టీ అధికారికంగా అవకాశం కల్పిస్తుందన్నది వేచి చూడాల్సిందే.

**కుటుంబ రాజకీయాలా? కొత్త ముఖాలకా అవకాశం?..** చైర్మన్ పదవి మహిళలకు రిజర్వ్ కావడంతో స్థానికంగా రాజకీయ అనుభవం ఉన్న నాయకుల కుటుంబాల నుంచి మహిళా అభ్యర్థులు ముందుకొచ్చే అవకాశాలపై చర్చ సాగుతోంది. మరోవైపు, పార్టీ కోసం పనిచేస్తున్న మహిళా నాయకులకు అవకాశం కల్పించాలన్న అభిప్రాయాలు కూడా ఉండవచ్చు. అయితే అభ్యర్థుల ఎంపిక కేవలం కుటుంబ నేపథ్యం ఆధారంగానే జరుగుతుందని చెప్పలేం. పార్టీ అంతర్గత సమీకరణాలు, స్థానిక నాయకుల అభిప్రాయాలు, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం, ఎన్నికల వ్యూహం వంటి అంశాలు కూడా నిర్ణయంపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డులో ఘోర ప్రమాదం

- డివైడర్‌ను ఢీకొనడంతో ఈవీ కారులో చెలరేగిన మంటలు
- కారులో మంటలు నలుగురు సజీవదహనం



**గొల్లపూడి,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** విజయవాడ వెస్ట్ బైపాస్ పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. సేకరించిన వివరాల ప్రకారం విజయవాడ వెస్ట్ బైపాస్ పై వెళుతున్న కారు అదుపుతప్పి డివైడర్ ను ఢీకొనడంతో కారులో మంటలు చెలరేగాయి. ఒకసారిగా మంటలు చెలరేగటంతో తప్పించుకునే వీలు లేక కారులో ప్రయాణిస్తున్న నలుగురు సజీవదహనం అయ్యారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరొక వ్యక్తి పరిస్తితి విషమం ఉన్నట్లు తెలుస్తోంది. నంబూరులో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా విషాదం నెలకొంది. మృతులు నున్న, నంబూరు వాసులుగా పోలీసులు గుర్తించారు. మృతుల్లో నున్నకు చెందిన కొమ్మారెడ్డి రాందేవ్ (39), ఆయన తల్లి అరుణ ఉన్నారు. సమాచారం అందుకుని సహాయక చర్యలు చేపట్టిన పోలీసులు.

## తిరువూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ భవన నిర్మాణానికి విరాళాలు



**తిరువూరు,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** తిరువూరు మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ భవన నిర్మాణానికి మాజీ జెడ్పీటీసీ సభ్యులు గద్దె రమణ రూ.65,000 విరాళంగా అందజేశారు. ఈ విరాళాలను తిరువూరు మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వేముల రమేష్ ఏసు స్వీకరించారు. యూనియన్ భవన నిర్మాణానికి సహకారం అందించిన దాతకు యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## విక్టరీ బజార్‌ను ప్రారంభించిన తిరువూరు ఆర్డీవో ఏ. కుమార్



**తిరువూరు,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** తిరువూరు పట్టణ ప్రజలకు నిత్యావసర సరుకుల కొనుగోలులో మరింత సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన నూతన మార్ట్ విక్టరీ బజార్‌ను తిరువూరు రెవెన్యూ డివిజన్ అధికారి ఏ. కుమార్ నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఏ. కుమార్ మాట్లాడుతూ, పట్టణంలో పెరుగుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన వ్యాపార సంస్థలు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజలకు నిత్యావసర సరుకుల కొనుగోలుకు మరింత సౌకర్యవంతమైన వసతులు అందుబాటులోకి రావడం వల్ల వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. విక్టరీ బజార్ నిర్వాహకులు వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి, విష్ణురెడ్డి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో ఏ. కుమార్ గారిని ఘనంగా సన్మానించారు. తిరువూరు పట్టణ ప్రజలకు నిత్యావసర సరుకులను ఒకే చోట అందుబాటులో ఉంచుతూ, కొనుగోలుదారులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ మార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నూతన మార్ట్ అందుబాటులోకి రావడంతో తిరువూరు పట్టణ ప్రజలకు నిత్యావసర సరుకుల కొనుగోలులో మరింత సౌలభ్యం కలగనుంది.

## ఘనంగా టిడిపి యువ నాయకులు మాగంటి నాని జన్మదిన వేడుకలు





**విస్సన్నపేట,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో మాగంటి వారి వీధిలో టిడిపి యువ నాయకులు మాగంటి నాని (సత్యనారాయణ చౌదరి) జన్మదిన వేడుకలను బి టీం యూత్ యువ నాయకులు ఘనంగా నిర్వహించారు. భారీగా బాణసంచా కాల్చి బడా కూల్ కేకు కట్ చేసి అందరికీ పంపిణీ చేసి సంబరాలు చేశారు. అనంతరం టిడిపి సీనియర్ నాయకులు రామినేని రామారావు నాయకత్వంలో సత్తుపల్లి రోడ్డులో నాని జన్మదినోత్సవ సంబరాలను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో పులిహోర ప్యాకెట్ల పంపిణీ చేశారు. భారీ ఎత్తున జరిగిన కార్యక్రమంలో కూటమి పార్టీ సభ్యులు విఘ్నేశ్వర కోలాటం బృందం సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ వెటరన్స్ క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన గూడూరు జెడ్పీహెచ్ఎస్ పీడీ అరుణ



**పెడన,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం గూడూరు జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ డైరెక్టర్ ఎం. అరుణ జాతీయ స్థాయి వెటరన్స్ క్రీడల్లో స్వర్ణ పతకం సాధించి పాఠశాలకు గ్రామానికి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. కోయంబత్తూరులో అక్టోబర్ 7 నుంచి 11 వరకు జరిగిన 5వ వెటరన్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నేషనల్ ఛాంపియన్‌షిప్--2026లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆమె 50 ఏళ్లు పైబడిన విభాగంలోని 80 మీటర్ల హార్డిల్స్ పోటీలో ప్రథమ స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.విజయకుమారి ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామ పెద్దలు అరుణను అభినందించారు. ఆమె విజయం విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పట్టుదలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. నిరంతర సాధన, క్రమశిక్షణతో వయస్సు విజయానికి అడ్డంకి కాదని ఆమె నిరూపించారని ప్రశంసించారు.

## ఆమె ఎప్పటికీ చిరంజీవినే ఐడియల్ కళాశాలలో చిరంజీవిని కుమారి విగ్రహావిష్కరణ

● ఆకట్టుకోలేని గరికిపాటి ప్రసంగం






**కాకినాడ,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** ఐడియల్ కళాశాల పూర్వ కరస్పాండెంట్, సామాజిక వేత్త డాక్టర్ చిరంజీవి కుమారి భౌతికంగా మరణించినా ఎప్పటికీ చిరంజీవిని గానే కళాశాలలోనూ ఆయా విద్యార్థుల్లో నిరంతరం నిలిచి ఉంటుందని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు పేర్కొన్నారు. సోమవారం విద్యుత్ నగర్లో ఉన్న ఐడియల్ కళాశాలలో చిరంజీవి కుమారి విగ్రహాన్ని గరికిపాటి నరసింహారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూ-ర్వ శాసనసభ సభాపతి, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆమె గురించి ప్రసంగించారు. కాకినాడలో ఒక మంచి భావాల ఉద్దేశంతో ఈ కళాశాల సుమారు 50 ఏళ్ల క్రితం స్థాపించారని చెప్పారు. అప్పుడు ఈ కళాశాలకు తన తండ్రి మంత్రిగా ఉండి అనుమతి ఇచ్చినట్లు గుర్తు చేసుకున్నారు. ఆమె ఆశయాలను కళాశాల యాజమాన్యం కొనసాగించాలని సూచించారు. ముఖ్యఅతిథి, విగ్రహవిష్కరణ కర్త గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ కాకినాడ, చిరంజీవిని కుమారితో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని చెప్పారు. ఆమె ఏ పనినైనా సరే చాలా చాకచక్యంగా నిర్వహించి పూర్తి చేసేదన్నారు. తెలుగు భాష కళాశాలలో చేర్చారంటే ఆమె పాత్ర చాలా ఉందన్నారు. ఆమె చిరంజీవి గానే ఐడియాలు విద్యార్థుల మనస్సుల్లో ఉంటుందన్నారు. ఆమె కార్యక్రమాలను ఎటువంటి ఒత్తిడి గురు కాకుండా అనుకున్న పనులు సాధించి కాకినాడ ఐడియల్ కళాశాల విద్యార్థుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. గరికపాటి ప్రసంగం వినేందుకు ఎంతోమంది ఎదురుచూడగా ఈసారి ఆయన ప్రసంగం అంతగా ఆకట్టుకోలేక పోయాయి. దీంతో ఆయన ప్రసంగం వినేందుకు హాజరైన వారిలో నిరాశ కనిపించింది. అనంతరం గరికపాటి దంపతులను, విగ్రహ శిల్పి రాజ్ కుమార్ వడయారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, బొర్రా గోపి మూర్తి, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), కాకినాడ నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ పర్చూరు కృష్ణారావు, చిరంజీవిని కుమారి కుమారులు గోపాల్, కిరణ్, కళాశాల ఏవో జీవీకే వర్మ విద్యార్థులు, అధ్యాపక, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని అఖిలపక్షం ధర్నా



**కాకినాడ, కలక్టరేట్,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** రాజ్యాంగానికి విరుద్ధంగా, స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ పక్షపాతం చూపిస్తూ బిజెపికి అనుకూలంగా ఏకపక్షంగా 13 కోట్ల ఓట్ల తొలగింపునకు పాల్పడిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాకినాడ అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఉద్యమ సీనియర్ నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వరదరాజ సాంచి, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు నాగేశ్వరరావు, ఆర్పీఐ స్టేట్ జనరల్ సెక్రెటరీ పెనుమాల సుధీర్, సిపిఐ న్యూ డెమోక్రసీ నాయకులు గుబ్బల ఆదినారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాదేపల్లి సత్యానందరావు మాట్లాడుతూ, బిజెపి కార్యకర్తగా వ్యవహరిస్తున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసేంతవరకు పోరాడుతామని, మోడీ ప్రభుత్వం శాంతియుత ఆందోళనకు సిద్ధపడ్డ జెన్ జి విద్యార్థులపై దమనకాండ సాగించడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడికి ప్రజాస్వామ్యతంగా ఆందోళన చేసే హక్కు ఉందని గుర్తుచేశారు. తక్షణం మోడీ ప్రభుత్వం అరెస్టు చేసిన 10వేల మంది ఆందోళనకారులను విద్యార్థులను వేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తొలగించిన 13 కోట్ల భారతీయుల ఓట్లను పునరుద్ధరించి ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి భారతీయుడికి ఓటు హక్కు కల్పించి, ఎన్నికల కమిషన్ యొక్క స్వతంత్రతను ప్రజలే పోరటాల ద్వారా కాపాడుకోవాలన్నారు. ఆర్ఎస్ఎస్ బిజెపి నుండి భారత రాజ్యాంగాన్ని, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి రాబోయే రోజుల్లో అఖిలపక్షం ముందుండి పోరాడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చెక్కల రాజకుమార్, కేవస్ శ్రీనివాస్, టేకుముడి ఈశ్వరరావు, సీపీఎం నగర కమిటీ సభ్యులు మెడిశెట్టి వెంకట రమణ, మలకా రమణ, నాగబత్తుల సూర్యనారాయణ, రూరల్ కమిటీ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు, అజయ్ కుమార్, పెద్దింశెట్టి రామకృష్ణ, ఐలూ జిల్లా నాయకురాలు జ్యోతి, ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు సూరిబాబు, సాహిత్, అనపర్తి ఏడుకొండలు, ఎం.ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లూరి రాజు, మొయేటి సూర్యప్రతాప్, వివి.రమణ, లోక్ పాల్, త్రిమూర్తులు, ఖమ్మం రాజబాబు, కామరాజు, సీపీఐ ఎంఎల్ న్యూ డేమోక్రసి నాయకులు మారుకుర్తి యేసు, గంటా బాలరాజు, వి.చిట్టిబాబు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నరాల శివ, కృష్ణ మోహన్, కోరాపు రవికుమార్, సామాజిక న్యాయ సమితి నాయకులు దాసరి వెంకటరావు, అడ్వకేట్ కాళిదాసు, పిల్లి రాంబాబు, కాశి బాలయ్య, బుద్ధవిహార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమమే ఏపీఎంఎఫ్ ప్రధాన లక్ష్యం

● 60 ఏళ్లు దాటిన జర్నలిస్టులకు పెన్షన్ కోసం ప్రభుత్వంతో పోరాటం

● ఏపీఎంఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. ఢిల్లీబాబు రెడ్డి




**విజయనగరం,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** జర్నలిస్టుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపీఎంఎఫ్) ప్రధాన లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. ఢిల్లీబాబు రెడ్డి అన్నారు. విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన ఏపీఎంఎఫ్ జిల్లా వార్షిక మహాసభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఢిల్లీబాబు రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంతో పోరాటం చేస్తున్నామని తెలిపారు. 60 ఏళ్లు దాటిన జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు చేయించేందుకు ప్రభుత్వానికి తగిన సూచనలు, సలహాలు అందిస్తున్నామని, పెన్షన్ సదుపాయం సాధించే వరకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని హామీలు ఇస్తున్నప్పటికీ, ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరు విషయంలోనూ అనేక ప్రయత్నాలు చేసి, ప్రభుత్వంతో సంప్రదింపుల ద్వారా కార్డులు మంజూరయ్యేలా కృషి చేశామని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మజ్జి సిరి సహస్ర మాట్లాడుతూ, పాత్రికేయులను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సమాజం కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టులకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. జర్నలిస్టులను ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన జనసేన పార్టీ సీనియర్ నాయకుడు కోట్ల రఘు మాట్లాడుతూ, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య జర్నలిస్టులు వారధిగా నిలుస్తున్నారని అన్నారు. సమాజంలో చోటుచేసు కునే పరిణామాలు, అవాంఛనీయ సంఘటనలపై పాత్రికేయులు దృష్టి సారించాలని పేర్కొన్నారు. సమాజానికి దిశానిర్దేశం చేయడంలో పత్రికల పాత్ర కీలకమని తెలిపారు. సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్) అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ, జర్నలిస్టులతో తమకు ఎల్లప్పుడూ సత్సంబంధాలు ఉన్నాయని, గత ప్రభుత్వంలోనూ, ప్రస్తుత ప్రభుత్వంలోనూ జర్నలిస్టులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ మహాసభకు విశాఖ జిల్లా ఏపీఎంఎఫ్ అధ్యక్షుడు కె. కిరణ్ కుమార్, రాష్ట్ర ఉప కార్యదర్శి లత, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు సుధీర్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తమ్ము అప్పలరాజు, కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

**ఏపీఎంఎఫ్ విజయనగరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక..** మహాసభలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీఎంఎఫ్ విజయనగరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**నూతన కార్యవర్గం:** అధ్యక్షుడు: వాడాడ గౌరీ శంకరరావు, ప్రధాన కార్యదర్శి: అల్లాడ వెంకటరమణ, కోశాధికారి: గంధవరపు అరుణ్ కుమార్, వీరితో పాటు కార్యవర్గ సభ్యులు, సంయుక్త కార్యదర్శులను కూడా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు జర్నలిస్టులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం సంఘం తరపున నిరంతరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## జనరల్ మహిళకు రిజర్వ్ అయిన పెడన పురపాలక సంఘం



**పెడన,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** పెడన పురపాలకసంఘం రిజర్వేషన్ విషయమై కొద్ది రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠతకు తెలపడింది. ఈ పదవిని జనరల్ మహిళకు కేటాయిస్తూ సోమవారం సాయంత్రం ప్రభుత్వ ప్రకటన వెలువడింది. ఇంతకు ముందు బిసి మహిళకు ఈ పదవిని కేటాయించారు. పరోక్ష పద్ధతిలో చైర్మన్ ను ఎన్నుకునే విధానంలో వైసిపి నుంచి బళ్ళ గంగయ్య భార్య జ్యోత్స్న రాణి కటకం ప్రసాద్ భార్య నాగకుమారి లు ఛైర్పర్సన్ లుగా పనిచేసారు. ఇపుడు ప్రత్యక్ష పద్ధతిలో ఈ పదవికి ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వంలో మూడు పార్టీలు కొనసాగుతున్న విషయం కూడా తెలిసిందే. ఇందులో భాగంగా పెడన ఏ పార్టీ కోటా లోకి వెళు తుందో చూడవలసి ఉంది. ఇప్పటివరకు కాంగ్రెస్ టిడిపి వైసిపిలు ఇక్కడ పాలన చేశాయి. టిడిపికి జనసేనకు మధ్య రాష్ట్రస్థాయిలో పొత్తు విషయమై ఇంకా తుది నిర్ణయం వెలువడ లేదు. రిజర్వేషన్ లెక్కలు తేలిపోయాయి గనుక ఇక షెడ్యూలు ఆ తర్వాత నోటిఫికేషన్ వెలువడవలసి ఉంది. చైర్మన్ కు పోటీపడేవారు ఇప్పటివరకు ఎవరూ కూడా బయటపడలేదు. ఇకనుంచి ఆ దిసగా వీరు పావులు కదిపే అవకాశం ఉంది.

## గాయత్రీ దేవి అలంకరణలో శ్రీ కనకదుర్గమ్మ తల్లి దర్శనం





**ఆగిరిపల్లి,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి వరాహ పుష్కరిణి(మెట్ల కోనేరు) సమీపంలో స్వయంభువుగా పూజలందుకుంటున్న శ్రీ కనకదుర్గమ్మ తల్లి దసరా నవరాత్రులు పురస్కరించుకుని, సోమవారం రెండవ రోజు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి సీ.హెచ్.సాయి పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు దేవులపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. గాయత్రీ దేవి అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దీంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మధ్యాహ్నం భక్తుల ఆర్థిక సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, బలిహరణ కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు

## యార్లగడ్డ చొరవతో రామాలయ పునర్నిర్మాణానికి నిధులు



**హనుమాన్ జంక్షన్, అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం రేమల్లె గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.1,58,67,000 సెంట్రల్ గ్రాంట్స్ ఫండ్ (సీజీఎఫ్) నిధులు మంజూరయ్యాయి. గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు చొరవతో ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్, సీజీఎఫ్ కమిటీ కార్యదర్శి కె. రామచంద్ర మోహన్ ఆలయ పునర్నిర్మాణానికి పరిపాలనాపరమైన అనుమతులు జారీ చేశారు. దీంతో రేమల్లె గ్రామంలోని కోదండ రామస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు మార్గం సుగమమైంది. ఈ సందర్భంగా గ్రామస్థులకు అనుమతి పత్రాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొల్లూరు చంద్రకాంత్, ఆలయ కమిటీ సభ్యులు యనమదల సుధాకర్, వడ్లమూడి జానకిరామమూర్తి, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు లింగవరపు లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బందరు పార్లమెంటు జనసేన నిర్వాహక దళ్ సభ్యునిగా నవీన్ కృష్ణ



**పెడన,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** జనసేన పార్టీ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా వివిధ స్థాయి ల్లో కమిటీలను ఏర్పాటు చేస్తుంది. ఎన్నికలను ఎదుర్కొనేందుకు పార్లమెంటు స్థాయిలో నిర్వాహక దళ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఏడు నియోజకవర్గాల నుంచి మొత్తం 32 మందిని నియమించింది. పెడన మండలం నుంచి చీర్ల నవీన్ కృష్ణను ఈ కమిటీలోకి తీసుకున్నారు. నడుపూరు గ్రామానికి చెందిన నవీన్ పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. గతంలో మండల జనసేన ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. అలాగే పార్లమెంట్ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సభ్యునిగా సభ్యత్వం నమోదు విషయంలో నవీన్ క్రియాశీలకంగా వ్యవహరించాడు. తనకు ఈ పదవి ఇవ్వడం పట్ల జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపాడు.

## వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం మండల కార్యదర్శిగా తాటి శివరామకృష్ణ



**గన్నవరం,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం మండల కార్యదర్శిగా తాటి శివరామకృష్ణ నియమితుల య్యారు. పార్టీ అధిష్ఠానం, నియోజకవర్గ నాయకులు ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషి, యువతలో చురుకైన పాత్రను గుర్తించి ఈ నియామకం చేపట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నియామకం పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాటి శివరామకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తాటి శివరామకృష్ణకు అభినందనలు తెలిపి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ముగ్గురమ్మల మూలపుటమ్మ మారెమ్మ తల్లి సన్నిధిలో ప్రారంభమైన దసరా మహోత్సవ ఉత్సవాలు





**విస్సన్నపేట,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని పుట్రేల మారెమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అంగరంగ వైభవంగా శరన్నవరాత్రి దసరా ఉత్సవ మహోత్సవ సంబరాలను ప్రారంభించారు. ఆలయ చైర్మన్ తెర్ల శ్రీనివాసరావు దంపతులు వేదపండితులు నిర్ణయించిన బ్రహ్మ ముహూర్తంలో పచ్చని మామిడి తోరణాలతో సన్నాయి వాయిద్యాల మధ్య విఘ్నేశ్వర పూజతో దుర్గమ్మ తల్లిని ప్రతిష్టించారు. ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పూల మాలలతో అలంకరించారు. తొలిరోజు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. 20 వరకు జరిగే దసరా ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు అమ్మవారు ఒక్కో అవతారంలో దర్శనమివ్వనున్నట్లు ఆలయ చైర్మన్ తెలియజేశారు. బాలా త్రిపుర సుందరి, గాయత్రీ, అన్నపూర్ణ, మహా చండీ, లలిత, సరస్వతి, మహాలక్ష్మి, దుర్గ, మహిషాసుర మర్దిని, రాజరాజేశ్వరి అవతారాలలో అమ్మవారిని అలంకరించడం జరుగుతుందని పలు రాష్ట్రాల నుండి కోరిన వారికి కొంగుబంగారం మారెమ్మ అమ్మవారి ఆలయానికి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే వేలాదిమంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, తాగునీరు, క్యూ లైన్లు, వాలంటరీ బందోబస్తు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వి డి డి ప్రసాద్, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు అరిగే శ్రీనివాసరావు, వాసు బాబు, ధనుంజయ్ గాదె రమేష్ దంపతులు,వేమిరెడ్డిపల్లి నెక్కలపు సాంబశివరావు దంపతులు,గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# రెండు చెరువులను వెంటనే శుభ్రం చేయాలని డిప్యూటీ కమిషనర్‌కు వినతి

**ఘట్కేసర్ సర్కిల్ ప్రజావాణిలో నాగారం డివిజన్ చెరువుల సమస్యపై వినతి సమర్పించిన నాగారం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి**



**నాగారం, అక్టోబర్ 12(వార్తా ప్రభ):** నాగారం డివిజన్ పరిధిలోని అన్నారాయణ చెరువు మరియు దాయరకుంట చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించి, చెరువులను శుభ్రం చేయాలని కోరుతూ ఘట్కేసర్ సర్కిల్ ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డికి నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస రెడ్డి, మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట రెడ్డి, వినతి పత్రం అందజేశారు. చెరువుల్లో గుర్రపుడెక్క తొలగించినప్పటికీ మళ్లీ విపరీతంగా పెరగడంతో దోమల బెడద పెరిగి, పరిసర కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. చెరువులను పూర్తిస్థాయిలో శుభ్రం చేసి, భవిష్యత్తులో గుర్రపుడెక్క మళ్లీ పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యపై డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డి సానుకూలంగా స్పందించి, వెంటనే కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి రెండు రోజుల్లో అన్నారాయణ చెరువు, దాయరకుంట చెరువులను పూర్తిగా శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సుమిత్ర సురేష్, మాజీ వార్డు మెంబర్ సత్యం సాగర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గణపురం కొండల్ రెడ్డి, షేక్ గౌస్, మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఘనంగా గేమ్ చేంజర్ అవార్డ్స్ 2026

**కంతేటి వెంకట సుబ్బారావుకు పురస్కారం ప్రదానం**



**బాచుపల్లి, అక్టోబర్ 12, (వార్తాప్రభ) :** విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ వ్యవస్థాపకుడు సచ్చివోలు రాంబాబు ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఆడిటోరియంలో ప్రతిష్ఠాత్మక గేమ్ చేంజర్ అవార్డ్స్ 2026 ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులకు ఈ వేదికపై అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ జూకంటి అనిల్ కుమార్ హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా ప్రైమ్ 9 న్యూస్ ఛానల్ చైర్మన్ బండి శ్రీనివాస రఘువీర్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి సురేందర్ రెడ్డి, ప్రముఖ సినీ నిర్మాత, దర్శకుడు నాగబాల సురేష్ కుమార్ పాల్గొన్నారు. సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తూ విశేష సేవలందించినందుకు గాను సామాజిక సేవా విభాగంలో కంతేటి వెంకట సుబ్బారావుకు విశిష్ట "గేమ్ చేంజర్ అవార్డు"ను అందజేసి ఘనంగా సత్కరించారు. సమాజ నిర్మాణంలో విశేష సేవలందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని అతిథులు కొనియాడారు.

# ప్రాణాంతక చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు

**సూరారం చౌరస్తాలో పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ హెచ్చరిక**



**సూరారం, అక్టోబర్ 12, (వార్తాప్రభ) :** నిషేధిత చైనా మాంజా వినియోగంపై సమాజం కఠినంగా వ్యవహరించాలని, దీని విక్రయదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సామాజిక, పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. సూరారం చౌరస్తా పరిసరాల్లో చైనా మాంజాతో గాలిపటాలు ఎగురవేస్తున్న ఇద్దరు యువకులను ఆయన పట్టుకుని, ప్రాణాల విలువను వివరిస్తూ వారితో గుంజీలు తీయించి కౌన్సిలింగ్ ఇచ్చారు. **మాంజా విక్రయాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలి** గతంలో చైనా మాంజా మెడకు చుట్టుకుని ఓ మిలిటరీ ఉద్యోగి, కానిస్టేబుల్‌తో పాటు పలువురు పాదచారులు, వాహనదారులు ప్రాణాలు కోల్పోయిన విషాదాలను ఆయన గుర్తుచేశారు. ఇటీవల జీడిమెట్లలో బీహార్‌కు చెందిన మనీష్ అనే వ్యక్తి కూడా చైనా మాంజా కారణంగా తీవ్ర గాయాలపాలై ఆసుపత్రి పాలైనట్లు తెలిపారు. రోడ్లపై వెళ్లే వాహనదారులకు, మూగజీవాలకు మృత్యుపాశంగా మారిన ఈ మాంజాను నిర్మూలించేందుకు స్థానిక సర్పంచులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, మహిళా సంఘాలు, కాలనీ ప్రతినిధులు నడుం బిగించాలని కోరారు. ఎక్కడైనా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఆ విక్రేతలపై కేసులు నమోదు చేయించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అప్రమత్తంగా ఉండి సమాచారం ఇవ్వడం ద్వారా తోటివారి ప్రాణాలను కాపాడిన వారవుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎం రాజు, అనిల్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గాయత్రి దేవి అలంకరణలో దుర్గమ్మ..

**ఆసిఫాబాద్, అక్టోబర్ 12 (వార్తాప్రభ)::** రెండవరోజు శ్రీ గాయత్రి దేవిగా దర్శనమిచ్చిన ఇందిరానగర్ దుర్గమ్మ, అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేసి ఓడి బియ్యం, నైవేద్యాలు సమర్పించిన భక్తులు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ డా దేవార వినోద్ స్వామి వచ్చిన భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

# ఎఫ్ఐఆర్ నమోదు అయ్యాకే దహన సంస్కారాలు జరపాలి

**● మల్కాజిగిరి కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి కి జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటి ప్రజావాణిలో సమర్పించిన వినతిపత్రం. ● చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ అధ్యక్షతన పాల్గొన్న బాగస్వామ్య సంస్థలకు చెందిన ప్రతినిధులు.**






**జవహర్ నగర్, అక్టోబర్ 12(వార్తా ప్రభ):** జవహర్ నగర్ రాంకి చెత్త డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల్లో సంభవించే అనారోగ్య మరణాలపై సంభందిత పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎఫ్ఐఆర్ నమోదు అయ్యాకే దహన సంస్కారాలు జరిపేలా ఆయ ప్రాంతాల్లోని స్మశానవాటికలకు ప్రభుత్వ అధికారులు నోటీసులు జారీచేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కమీషనర్ కార్యాలయం, ప్రజావాణిలో సమర్పించిన వినతిపత్రంలో జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ డిమాండ్ చేసింది. 2026, అక్టోబర్–12, సోమవారం రోజు, తార్నాక పరిధిలో గల మల్కాజిగిరి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కి కీసరసర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ లోగల రాంకి డంపింగ్ యార్డును వెంటనే శాస్త్రీయ పద్ధతిలో శాశ్వతంగా మూసివేసి, పర్యావరణ పునరుద్ధరణ, ఉచితంగా పరిశుభ్రమైన మంచినీటి సరఫరా, వైద్య సౌకర్యాలు అందించాలని జేఏసి చైర్మన్, ఐ.ఎఫ్.టి.యు. షేక్ షావలి, జేఏసి కన్వీనర్, సిపిఐ ఉమామహేష్ అధ్యక్షతన జేఏసి కో కన్వీనర్స్ సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ గద్దం సదానందం, జేఏసి కోశాధికారి సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ పి.శివబాబు, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై మల్లేష్, టియుసిఐ వి.ప్రవీణ్, పీఓడబ్ల్యూ(విముక్తి) గడిపే సునీత, విఆర్ఆర్ హోమ్స్ సురేందర్, పిఓడబ్ల్యూ జయసుధ, టిజేఎస్ బద్రగామి అంజినేయులు, పికెఎం రాజానర్సింహ్మా తదితరులు డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని సమర్పించిన వారిలో ఉన్నారు. వారంరో ఇద్దరు లేదా ముగ్గురు డంపింగ్ యార్డు విష వాయువుల వలనే అర్ధాంతరంగా అకాల మరణాలకు గురౌతున్నారని గుర్తుచేశారు. గ్రేటర్ హైదరాబాద్ చెత్తనంతటిని జవహర్ నగర్ కు తరలించడం ద్వారా సంభందిత ప్రాంతాల ప్రజలు ఆరోగ్య, పర్యావరణ సంక్షోబాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. మితేన్ వాయువుతో గాలి, లిచేట్ ద్రవాలతో భూగర్భ జలాలు కలుషితమై, ఊపిరి సలపని వ్యాదులతో మానసిక, శారీరక భాదలతో సతమత మవుతున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలో ప్రభుత్వం డంపింగ్ యార్డు సమస్యపై ఎంపి, ఎమ్మెల్యే లతో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం తర్వాత ప్రభుత్వ అధికారులు తీసుకున్న నిర్ణయాలను, వాటి అమలు ఏ మేరకు కొనసాగుతున్నాయో? స్పష్టంగా, డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల ప్రజలకు వ్రాత పూర్వకంగా తెలియజేసి, బహిరంగంగా తెలియజేయాలని కోరారు. గత నెలరోజులుగా కార్మికనగర్, గబ్బిలాలపేట, శాంతినగర్, ఆర్జీకాలనీ, ధమ్మాయిగూడ, ఈస్ట్ నందమూరి నగర్ లాంటి తదితర ప్రాంతాల కాలనీల్లో ఎన్నడు లేనివిధంగా విపరీత దుర్వాసనలు, గ్యాస్ లీకేజీలు, మురికి నీరు పైపులైన్లు ధ్వంసం, మురికినీటి బుడగలు గాలిద్వారా ఇళ్ళల్లోకి ప్రవేశించి తినే ఆహారం, త్రాగే మంచినీరు, బట్టలు, తలుపులు, కిటికీలపై పడి వృద్ధులు, పసిపిల్లలు, మహిళలు ఊపిరితిత్తులు, చర్మ వ్యాదుల సమస్యలతో బాదపడుతున్నారని తెలియజేశారు. యుద్ధ ప్రాతిపదికన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు, తర్వాత ఇచ్చిన హామీల అమలులో బాగంగా ఒక కిలో చెత్త కూడ జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు తరలించకుండా చూడాలని అన్నారు. లేనియెడల భవిష్యత్ లో ప్రజా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని గుర్తుచేశారు. దానికి నైతిక భాద్యత ప్రభుత్వ అధికారులే వహించాల్సి ఉంటుందని తెలియజేశారు.

# కాసాని లక్ష్మీనగర్‌పై నిర్లక్ష్యం ఇంకెన్నాళ్లు?

**● ఇంటి పట్టాలు ఏవీ? ● వీధి దీపాలు ఎక్కడ? ● మంచినీరు ఎప్పుడు? ● మౌలిక వసతులు కల్పించాలి.. ● సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్ డిమాండ్ ● ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం..**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కాసాని లక్ష్మీనగర్‌కు తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సుజాతనగర్ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణిలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీవో భారతి లకు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీర్ల రమేష్ మాట్లాడుతూ.. గతంలో కొంతమందికి మాత్రమే ఇంటి పట్టాలు ఇచ్చారని, మిగిలిన అర్హులైన వారికి కూడా వెంటనే పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కాసాని లక్ష్మీనగర్‌లో పీఎం జన్మన్ పథకం కింద విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినప్పటికీ, ఇప్పటివరకు వీధి దీపాలు ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మరుగుదొడ్ల సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తాగునీటి సమస్య కూడా వేధిస్తోందని తెలిపారు. ప్రజల కనీస అవసరాలను తీర్చడంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కాసాని లక్ష్మీనగర్ వాసులకు ఇంటి పట్టాలతో పాటు వీధి దీపాలు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు కాట్రాల తిరుపతిరావు, బచ్చలకూర శ్రీనివాస్, బాలు, వెంకటేశ్వర్లు, భూక్య శంకర్, నల్లగొపు పుల్లయ్య, శోభన్, మెట్టెల సత్యనారాయణ, బేబీ రాణి, హేమ, మంగమ్మ, రమ్య, సీత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి.

**-జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్.**



**మహబూబాబాద్ అక్టోబర్ 12 (వార్తాప్రభ):** ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తు లను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ పురుషోత్తం, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, డి.ఆర్.ఓ నాగలక్ష్మి లతోకలిసి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పలు సమస్యలపై ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న ప్రజల యొక్క దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అన్నారు. ఈ రోజు వచ్చిన దరఖాస్తులలో మహబూబాబాద్ లోని గుమ్ముడూరు ప్రాంతానికి చెందిన అవారి నిర్మల సర్వే నెంబర్.36/ఏ లో గల ఒక ఎకరం 19 గుంటల భూమి నిషేధిత జాబితా నుండి పట్టా భూమి మార్చి పట్టా ఇప్పించగలరని కోరారు. కురవి మండలం బలపాల గ్రామానికి చెందిన మహాలక్ష్మి తాను గత 20 సంవత్సరాలుగా రేకుల ఇంట్లో నివాసిస్తున్నానని, ఇంతవరకు సరైన నివాస గృహం లేదని ఇందిరమ్మ ఇల్లు ఇప్పించగలరని కోరారు. కేసముద్రం మండలం పెనుగొండ గ్రామానికి చెందిన పురుషోత్తం రెడ్డి గ్రామ పంచాయతీ వారు గ్రామ రోడ్డు విస్తరణ లో భాగంగా తన ఇంటి ప్రహరీ గోడకు 3 ఫీట్ల రోడ్డు వెడల్పు కోసం నోటీసులు ఇచ్చి అక్రమంగా 12 ఫీట్ల వరకు తన స్థలశీలోకి వచ్చి దౌర్జన్యంగా రోడ్డు వెడల్పు పనులు చేపడుతున్నారని తన సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి జిల్లా కేంద్రంలో( 119 ), డివిజనల్ కేంద్రంలో(03) మండలాలలో(81) మొత్తంగా (203) దరఖాస్తులను పరిష్కారినికై సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మధుసూధనరాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి రవిరాథోడ్, జిల్లా న్యాయ సలహా పశుసంవర్ధక శాఖ అధికారి కిరణ్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీరాం, ఇంచార్జ్ డి.ఈ.ఓ మందుల శ్రీరాములు, జిల్లా పంచాయతీ అధికారి రేవంత్, సివిల్ సప్లై అధికారి రమేష్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీమన్నారాయణ రెడ్డి, ఇతర శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, పలు విభాగాల సూపరింటెండెంట్ లు, భూభారతి జిల్లా కో ఆర్డినేటర్ సురేష్, ఈ.డి.ఎం యుగేందర్, సంబందిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సుచిత్ర-మేడ్చల్ ఫ్లైఓవర్ల వద్ద వినూత్న నిరసన

**అసంపూర్తి పనులకు పిండప్రదానం చేసిన బీఆర్ఎస్ నేతలు, సాధన సమితి**



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 12, (వార్తాప్రభ) :** సుచిత్ర నుంచి మేడ్చల్ వరకు జాతీయ రహదారిపై మూడేళ్లుగా నిలిచిపోయిన ఫ్లైఓవర్ పనులపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ నేత కుంట సిద్ధిరాములు, మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో సుచిత్ర సర్కిల్‌లో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అసంపూర్తిగా మిగిలిన ఫ్లైఓవర్ పిల్లర్లకు ప్రతీకాత్మకంగా పిండప్రదానం చేసి పాలకుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**నిలిచిపోయిన పనులతో నిత్య నరకం.. స్పందించని పాలకులు** కాశ్మీర్ నుంచి కన్యాకుమారిని కలిపే ఈ అతిపెద్ద జాతీయ రహదారిపై నిత్యం భారీ వాహనాల రద్దీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని నేతలు గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద అప్పటి మంత్రి కేటీఆర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా, కేంద్రంతో సమన్వయం చేసుకుని ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని మంజూరు చేయించి శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. పిల్లర్ల నిర్మాణం పూర్తయ్యాక ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పనులు పూర్తిగా నిలిచిపోయాయని విమర్శించారు. పనుల పునఃప్రారంభం కోసం రెండేళ్లుగా ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగడంతో వేలాది మంది ప్రయాణికులు నిత్యం ట్రాఫిక్ జామ్‌లు, కాలుష్యం, ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**పనులు ప్రారంభించేవరకు ఆగని పోరాటం** సుచిత్ర నుంచి మేడ్చల్ వరకు అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ పనులను తక్షణమే పునఃప్రారంభించి గడువులోగా పూర్తి చేయాలని నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఉత్తర హైదరాబాద్ ప్రజల ప్రయాణ సౌలభ్యం కోసం మేడ్చల్, షామీర్‌పేట్ వరకు మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలపాలని కోరారు. ఫ్లైఓవర్లు పూర్తయ్యే వరకు ప్రజల పక్షాన ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత కుంట సిద్ధిరాములుతో పాటు సంపత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, జార్జ్, మోహన్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంధ్య, రాజేశ్వర్, లక్ష్మారెడ్డి, నరేష్ నేత తదితరులు పాల్గొన్నారు.

## వార్తా ప్రభ హైదరాబాద్

# భాగం శేషభూషణం మాతృమూర్తికి ఘన నివాళులు

**దశదినకర్మలో పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఎమ్మెల్యే కూనంనేని, మేయర్ మూడు గణేష్**



**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వార్తాప్రభ (ప్రతినిధి)సుజాతనగర్: సీతంపేట గ్రామంలో మాజీ సొసైటీ డైరెక్టర్, సీపీఐ సీనియర్ నాయకుడు భాగం శేషభూషణం మాతృమూర్తి ఇటీవల మృతి చెందారు. సోమవారం నిర్వహించిన ఆమె దశదినకర్మ కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మేయర్ మూడు గణేష్ పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళు లర్పించారు. అనంతరం భాగం శేషభూషణం కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భూక్య దసురు, లావుడియా సర్పంచ్ గరిక ఉపేందర్, ముక్కెర మురళి తదితరులు పాల్గొన్నారు.

# 467 సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా!

**జిల్లా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభించిన ఎస్పీ రోహిత్ రాజు**



**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం: జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సోమవారం ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, కమ్యూనిటీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 467 సీసీటీవీ కెమెరాలను ఈ కేంద్రానికి అనుసంధానం చేశారు. ఈ వ్యవస్థ ద్వారా అనుమానాస్పద కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించడం తోపాటు, నేరాల నియంత్రణ, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం సులభతరమవుతుందని ఎస్పీ తెలిపారు. ప్రజల భద్రత కోసం అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీసు అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకలపై బీఆర్ఎస్ కౌన్సిలర్ల విమర్శలు హాస్యాస్పదం..

**తొర్రూరు మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్..**



**తొర్రూరు అక్టోబర్ 12 (వార్తాప్రభ):** బతుకమ్మ వేడుకలపై బీఆర్ఎస్ కౌన్సిలర్ల విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయని మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్ అన్నారు. తొర్రూరు పట్టణంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు చేస్తున్న విమర్శలను మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజినీరాజశేఖర్ తీవ్రంగా ఖండించారు. కౌన్సిలర్లను వేదికపైకి ఆహ్వానించినప్పటికీ, తమను పిలవలేదంటూ ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వేట సంస్థపై అనవసరకు ఆరోపణలు మానుకోవాలన్నారు. వేటా సంస్థ గురించి వేదికపై ప్రత్యేకంగా ప్రస్తావించలేదని... ఆ సంస్థ పేరుతో స్టేజిపై బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రచారం జరగలేదని, ప్రైవేటు సంస్థకు ప్రచారం కల్పించామని ఆరోపిస్తున్నప్పుడు అందుకు సంబంధించిన ఆధారాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. గతంలో బీ ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ఉషా దయాకర్ రావు ఏ హోదాలో వేడుకలకు హాజరయ్యారని ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్‌ను కాంగ్రెస్ పార్టీ ఏజెంట్‌గా అభివర్ణించడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. అధికారుల పనితీరుపై అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, విచారణ కోరాలని సూచించారు. ఆధారాలు లేకుండా అధికారులకు రాజకీయ రంగు పులమడం ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధమని పేర్కొన్నారు.

# సంపాదకీయం

## జంతర్ మంతర్ కోసం సీజేపీ....2.0 అంటూ మొదలెడితే ?

: జంతర్ మంతర్ వేదిక కావాలని కాక్రోచ్ పార్టీ గట్టిగా కోరుతోంది. అది అచ్చి వచ్చిన ప్రాంతం కావడంతో సీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోమని చెబుతోంది. తాము నిరసనలు అన్నీ అక్కడే చేస్తామని అంటోంది. గతంలో అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద నిరసన చేపడతామని సీజేపీ ఢిల్లీ పోలీసులకు దరఖాస్తు చేసుకుంది. అయితే శాంతి భద్రతల దృష్ట్యా పోలీసులు అందుకు అనుమతించలేదు. ఏది ఏమైనా అక్కడే తాము నిరసన దీక్షలు చేస్తామని సీజేపీ ప్రకటించడంతోనే శనివారం అంతా ఢిల్లీలో వేలాది పోలీసులతో దిగ్బంధనం చేశారు. ఇపుడు చూస్తే మళ్ళీ సీజేపీ మరో సారి ఢిల్లీ పోలీసులకు అప్లికేషన్ పెట్టింది.జంతర్ మంతర్ వద్దనే తాము ఆందోళన చేపడతామని పట్టుదలగా ఉన్న సీజేపీ ఢిల్లీ పోలీసులను ఇదే విషయం మీద గట్టిగా పట్టుబడుతోంది. తాము అక్కడ శాంతియుత నిరసన చేపట్టేందుకు అనుమతించాలని కోరుతోంది. సీజేపీ చేపట్టబోయే నిరసనకు తేదీని అలాగే వేదికను ఇరవై నాలుగు గంటలలోనా ఖరారు చేయాలని దిల్లీ పోలీసులను సీజేపీ కోరారు. అనుమతి ఇవ్వకపోతే తామే మరో నిరసనకు పిలుపునిస్తామని సీజేపీ నేతలు తేల్చి చెప్పడం విశేషం. దాంతో ఢిల్లీ పోలీసులు ఏమి చేస్తారు ఏ రకమైన నిర్ణయం తీసుకుంటారు అన్నది ఇపుడు అతి పెద్ద చర్చగా ఉంది. నినాజికి జంతర్ మంతర్ తో సీజేపీ నిరసనలకు ఉన్న అనుబంధం అందరికీ తెలిసిందే.జంతర్ మంతర్ వద్ద సీజేపీ నేతలు కానీ ఆ పార్టీ మద్దతుదారులు కానీ ఒక్కసారి నిరసనలు చేపడితే ఏమవుతుంది అన్నది అందరికీ తెలిసిందే. అది రోజుల తరబడి సాగుతుంది. ఒకసారి నిరసన పిలుపు ఇచ్చాక అది సీజేపీ చేతులలో కూడా ఉండదు, వ్యవస్థీకృతం కాని సీజేపీని ఎవరూ నియంత్రించే పరిస్థితి ఉండదు అని అంటున్నారు. ఇక అరాచక శక్తులు అసాంఘీక శక్తులు కూడా ఈ ముసుగులో సీజేపీ ఉద్యమంలోకి ప్రవేశిస్తున్నాయని జూలై ఆందోళనలో పోలీస్ ఇంటెలిజెన్స్ వర్గాలు గమనించే ఆ ఉద్యమాన్ని కేంద్ర మంత్రి రాజీనామాతో ఆపించగలిగారు. ఈసారి కూడా ఉద్యమం అంటే కచ్చితంగా మరింత వేడిని వాడిని రాజేస్తుందని పోలీస్ వర్గాలతో పాటు పొలిటికల్ వర్గాలు కూడా అంటున్నాయి. ఇక కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అయితే ఢిల్లీలో లా అండ్ ఆర్డర్ ముఖ్యమని భావిస్తోంది. ఢిల్లీలో కూడా బీజేపీ ప్రభుత్వమే ఉంది. దాంతో సీజేపీ ఆందోళనకు ఈసారి జంతర్ మంతర్ వేదిక దక్కడం అంత సులువు కాదని అంటున్నారు.అయితే సీజేపీ కూడా పట్టుదలగా ఉంది. తమకు జంతర్ మంతర్ వేదికను అనుమతించాలని కోరుతోంది. శాంతియుతంగా నిరసన చేస్తామని అంటోంది. అలా అనుమతించకపోతే మరో రూపంలో నిరసనలు ఉంటాయని కూడా హెచ్చరిస్తోంది. మరి మరో రూపంలో నిరసనలు ఎలా ఉంటాయి ఏమిటి అన్నది కూడా చర్చగా ఉంది. మొత్తం మీద చూస్తే సీజేపీకి నీట్ పరీక్షా పత్రల లీక్ తరువాత సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా ఇష్యూ వేడిని రగిలించే మరో అతి పెద్ద మ్యాటర్ గా మారింది అని అంటున్నారు. అసలే అక్టోబర్ 10న జంతర్ మంతర్ నిరసనలు ఆపేశారు అన్న ఆగ్రహంతో సీజేపీ ఉంది. చూడాలి మరి ఢిల్లీ పోలీసులు ఏమి చేస్తారో సీజేపీ ఎలా రియాక్ట్ అవుతుందో అన్నది.

## సరస్ మేళాకు వచ్చే 'లఖ్‌పతి దీదీ'ల పిల్లల కోసం ప్రత్యేక క్రెష్ ఏర్పాటు

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 12 :(వార్త ప్రభ ప్రతినిధి)**విజయవాడలో అక్టోబర్ 13 నుంచి 31వ తేదీ వరకు భవానీపురం పున్నమి ఘాట్ వద్ద నిర్వహించనున్న జాతీయ స్థాయి సరస్ మేళా--2026కు వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొనే 'లఖ్‌పతి దీదీ'ల పిల్లల సంరక్షణ కోసం విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక క్రెష్ (శిశు సంరక్షణ కేంద్రం) ఏర్పాటు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.సోమవారం ఉదయం పున్నమి ఘాట్ వద్ద సరస్ మేళా ఏర్పాట్లను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ రాష్ట్రాల నుంచి సరస్ మేళాలో పాల్గొనే మహిళలు తమ పిల్లలను నగరపాలక సంస్థ ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక క్రెష్‌లో ఉంచి, పిల్లల సంరక్షణపై ఆందోళన లేకుండా తమ వ్యాపార కార్యకలాపాలను కొనసాగించవచ్చని తెలిపారు. మహిళలకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, పిల్లలకు సురక్షితమైన సంరక్షణ అందించడమే ఈ ప్రత్యేక ఏర్పాట్ల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తూ నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేయనున్న క్రెష్‌ల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేలా సరస్ మేళాలో ప్రత్యేక స్టాల్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.సరస్ మేళాకు వచ్చే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా, వాడుక నీటి పారుదల తదితర ఏర్పాట్లను పూర్తి స్థాయిలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మేళా ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయడంతో పాటు, కార్యక్రమం ముగిసే వరకు అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి. అన్నపూర్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ సుడిగాలి పర్యటన

**● లడ్డూ తయారీ కేంద్రం, అన్నప్రసాద భవనం, వైద్య శిబిరాల నిశిత పరిశీలన ● నూతన పూజా మండపంలో సతీసమేతంగా విశేష కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న కమిషనర్ ● ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులకు నిరంతరం మజ్జిగ, తాగునీరు అందించాలని ఆదేశం ● క్యూలైన్ల నిర్వహణ, పారిశుద్ధ్యంపై అధికారులకు కీలక దిశానిర్దేశాలు జారీ**





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 12 :(వార్త ప్రభ ప్రతినిధి)** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల నిర్వహణ ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ సోమవారం ఉదయం క్షేత్రస్థాయిలో సుడిగాలి పర్యటన జరిపి స్వయంగా పరిశీలించారు. రాజమండ్రి ఆర్జేసీ , దసరా ఫెస్టివల్ ఆఫీసర్ వి. త్రినాథరావుతో కలిసి ఆయన కొండపైన, కొండ దిగువన వివిధ విభాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలన చేశారు. లడ్డూ తయారీ కేంద్రం పరిశీలన: కొండపై ఉన్న లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రాన్ని (పోటు) కమిషనర్ పరిశీలించారు. ఉత్సవాల వేళ భక్తుల రద్దీకి సరిపడా నిల్వలను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని, కౌంటర్లలో భక్తులకు ఎటువంటి కొరత లేకుండా కోరినన్ని లడ్డూ ప్రసాదాలు వేగవంతంగా అందేలా ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు.నూతన అన్నదాన భవనాన్ని సందర్శించిన కమిషనర్, అక్కడ జరుగుతున్న అన్నప్రసాద వితరణ ఏర్పాట్లను పరిశీలించారు. భోజనం చేస్తున్న భక్తులతో స్వయంగా మాట్లాడి ఆహార నాణ్యత, అందుతున్న సేవలపై ఆరా తీశారు. సేవకుల తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.భక్తుల సంతృప్తి వ్యక్తం చేయడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.ఘాట్ రోడ్డు మరియు ఆలయ ప్రాంగణంలోని ఉచిత వైద్య శిబిరాలను తనిఖీ చేసి, అత్యవసర మందుల లభ్యతపై వైద్య సిబ్బందితో సమీక్షించారు. ప్రస్తుత ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో వేచి ఉండే భక్తులు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు అలసటకు గురికాకుండా ఉండేందుకు తగినంత ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని, విస్తృతంగా మజ్జిగ పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఇంద్రకీలాద్రిపై నిరంతర మంచినీటి సరఫరాపై సమీక్షిస్తూ, ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. క్యూలైన్లు, హోల్డింగ్ కేంద్రాలు ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.క్యూలైన్ల నిర్వహణను పరిశీలించి, సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేగంగా కదిలేలా పోలీసు యంత్రాంగం, ఆలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.?ఈ సందర్భంగా కమిషనర్ కె. రామచంద్ర మోహన్ సతీసమేతంగా నూతన పూజా మండపంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన ప్రత్యేక కుంకుమార్చన పూజలో పాల్గొన్నారు. అనంతరం ప్రధానాలయంలో శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి వేదాశీర్వచనం పలికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి ఆర్జేసీ ఓ ఫెస్టివల్ ఆఫీసర్ వి. త్రినాథరావు, ఆలయ ఇంజినీరింగ్ అధికారులు, పర్యవేక్షక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రోస్టేట్ గ్రంధి సమస్యలను నిర్లక్ష్యం చేయకండి!

**డాక్టర్ డి.వి .మాధవరావు యురాలజిస్ట్**




**గుంటూరు టౌన్ అక్టోబర్ 12 :(వార్త ప్రభ ప్రతినిధి)**వయస్సు పై పడుతున్న పురుషులలో కొద్దిమందిలో మూత్ర విసర్జన సమస్యలకు ప్రోస్టేట్ గ్రంధి కారణమవుతుదని, ఆ సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని ప్రముఖ యురాలజిస్ట్ డాక్టర్ డి.వి మాధవరావు అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక బ్రాడీపేటలోని ఎస్ హెచ్ ఓ సమావేశ మందిరంలో ఎస్ హెచ్ ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ ,మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ప్రోస్టేట్ గ్రంధి సమస్యలు- లక్షణాలు -నిర్ధారణ పరీక్షలు- చికిత్స విధానాలపై నిర్వహించిన శాస్త్రీ అవగాహన సభ- ఉచిత వైద్య సలహా శిబిరంలో డాక్టర్ డి.వి మాధవరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, అధ్యక్షులు డాక్టర్ టి. సేవ కుమార్ వహించారు .డాక్టర్ మాధవరావు ప్రసంగాన్నీ కొనసాగిస్తూ వయసుతో పాటే ప్రోస్టేట్ గ్రంధి కొందరిలో పరిమాణంలో పెరుగుతుందని, పరిమాణం పెరిగిన చాలామందిలో ఎలాంటి లక్షణాలు ఉండకపోవచ్చునన్నారు. మూత్రం సరిగా రాకపోవడం, ఆగి ఆగి రావడం, దార సరిగా లేకపోవడం,మొత్తం పోసిన తర్వాత కూడా మూత్రశయంలో ఇంకా మూత్రం మిగిలిపోవడం, మూత్రం వెంట రక్తం కారడం వంటి లక్షణాలు ఉంటే వైద్యుని సంప్రదించాలన్నారు. చాలామందిలో అందుకు కారణం బీపిహెచ్ కావచ్చునని,అతి కొద్ది మందిలో ప్రోస్టేట్ క్యాన్సర్ కావచ్చును అన్నారు. ఇప్పుడు బీపీహెచ్ కు చాలా రకాల మందులు వచ్చాయన్నారు .మంచి ఫలితాలను ఇస్తున్నాయన్నారు. మందులకు ఉపశమనం లేని అతికొద్ది మందికే శస్త్ర చికిత్స అవసరమవుతుందన్నారు. ప్రోస్టేట్ సమస్యలను అల్ట్రాసౌండ్ స్కానింగ్, పి.ఎస్.ఏ రక్త పరీక్షల ద్వారా నిర్ధారించుకోవచ్చునన్నారు. కొంతమందికి బయాప్సీ అవసరమవుతుందన్నారు. బి పి హెచ్ సమస్యలు గలవారికీ జీవన సరళలో మార్పులు అవసరమవుతాయన్నారు. రాత్రి సమయాలలో ఎక్కువగా మూత్ర విసర్జనకు లెగవ వలసి వస్తుందన్నారు .అందువల్ల సాయంత్రం నుంచి మంచినీరు అవసరం మేరకే తీసుకోవటం ,తగ్గించడం మంచిదన్నారు. అలాగే మద్యపానం ,ధూమపానం లకు కూడా దూరంగా ఉండాలన్నారు . ఎక్కువగా కాఫీలు టీలు తాగడం మంచిది కాదన్నారు.వైద్యుని పర్యవేక్షణలో అవసరమైనప్పుడు మందులు వాడుతూ సాధారణ జీవితం గడపవచ్చునన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ టీ సేవ కుమార్ మాట్లాడుతూ ప్రోస్టేట్ గ్రంధి సమస్యలు గలవారికి అక్టోబర్ 31వ తేదీ వరకు అతి తక్కువ ఖర్చుకే అల్ట్రా సౌండ్ స్కానింగ్, పిఎస్ఏ ,ప్రాస్టేట్ క్యాన్సర్ ప్రొఫైల్ పరీక్షలను అతి తక్కువ ఖర్చుకే అందిస్తున్నామన్నారు. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు .మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో ఆరోగ్య అంశాల్లో అవగాహన ఉన్నప్పుడే చాలా వ్యాధులను నిరోధించడం సాధ్యమవుతుందన్నారు. ఆ లక్ష్యంతోనే మా సంస్థలు ఈ శాస్త్రీయ అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నాయన్నారు. సమానంతరం డాక్టర్ డి.వి మాధవరావు ప్రోస్టేట్ గ్రంధి సమస్యలు గల వారిని పరీక్షించి వైద్య సలహాలు అందజేశారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు డాక్టర్ చల్లా చైతన్య , ఎస్ హెచ్ ఓ మేనేజర్ పి .నిర్మల రాణి ,మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గుంటూరు అధ్యక్షులు పి. వీరారెడ్డి, ఎన్. సాంబశివరావు ,ఎం. రామారావు ,టీ.వీ. సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# సింగ్ నగర్, పాయకాపురం ప్రాంతాల్లోఎస్సీలకే రిజర్వేషన్ సీట్లు కేటాయించాలి

**జై భీమ్ సమిష్టి శిఖరం అధ్యక్షులు బెజ్జం జయ పాల్**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 12(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) జనాభా అధికంగా ఉన్న డివిజన్లలో రాబోయే ఎన్నికల్లో అక్కడ ఎస్సీ రిజర్వేషన్లు కేటాయించాలని 'జై భీమ్ సమిష్టి శిఖరం' సోషల్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు బెజ్జం జయపాల్, ' దళిత ఐక్య వేదిక' కన్వీనర్ గాలంకి సతీష్ కుమార్ డిమాండ్ చేశారు. ?రాజ్యాంగ నిబంధనల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీలకు కల్పించిన ప్రాతినిధ్యం మేరకు వీఎంసీలోని 86 డివిజన్లలో దాదాపు 13 నుంచి 14 స్థానాలను ఎస్సీలకు కేటాయించాలని, డివిజన్ల రిజర్వేషన్లలో రొటేషన్ ప్రక్రియను పక్కాగా అమలు చేయాలని వారు కోరారు..సోమవారం విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని బి.ఆర్.అంబేడ్కర్ గ్రంథాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జయపాల్,, సతీష్ కుమార్ లు మాట్లాడారు.రాజ్యాంగ నిబంధనల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీలకు రావలసిన సీట్లు ఇవ్వాలని కోరారు.. 86 డివిజన్లలో 14 స్థానాలను ఎస్సీలకు కేటాయించి, డివిజన్ల రిజర్వేషన్లలో రొటేషన్ ప్రక్రియను అమలు చేయాలని కోరారు. సింగ్‌నగర్, పాయకాపురం పరిధిలో ఎక్కువ సంఖ్యలో ఉన్న ఎస్సీ ప్రజలకు స్థానిక ప్రజాస్వామ్య వ్యవస్థలో సముచిత రాజకీయ ప్రాతినిధ్యం లభించడం సామాజిక న్యాయం, సమాన అవకాశాల దృష్ట్యా ఎంతో అవసరమన్నారు..రానున్న ఎన్నికల దృష్ట్యా, సింగ్‌నగర్--పాయకాపురం పరిధిలోని డివిజన్ల వారీగా తాజా ఎస్సీ జనాభా వివరాలను అధికారులు సమగ్రంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. వర్తించే చట్టాలు, రొటేషన్ విధానం, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హత ఉన్న డివిజన్లను గుర్తించి, న్యాయబద్ధంగా రిజర్వేషన్లు ఖరారు చేయాలన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల అధికారులు, పురపాలక శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.. 2014 ఎన్నికల్లో కూడా సింగినగర్ ప్రాంతంలో ఉన్న ఎనిమిది డివిజన్లలో ఎస్సీ కేటగిరికి ఒక్క డివిజన్ కూడా కేటాయించకపోవడంతో అప్పటి శాసనసభ్యులు బొండా ఉమతో జనరల్ డివిజన్లో ఎస్సీ అభ్యర్థికి టికెట్ కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు..ఈ సమావేశంలో వేల్పుల రాజేష్,, తెల్ల భవాని,, కాకొల్లు హర్ష కుమార్,, వద్దూరి జయరాజ్,, ఈపూరి నవీన్,, మాకం దాస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న విశాఖపట్నం ఎంపీ భరత్.



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 12 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఇంద్రకీలాద్రిపై వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా గౌరవ విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు భరత్ సోమవారం ఉదయం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసి,శ్రీ గాయత్రీ దేవి దివ్యాలంకారంలో కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు.దర్శనానంతరం వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం పలకగా, ఆలయ అధికారులు శ్రీ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దసరా శరన్నవరాత్రుల వేళ ఇంద్రకీలాద్రిపై అమ్మవారి దర్శనం లభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే ఉత్సవాల్లో భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణ ఎంతో ప్రశంసనీయంగా ఉన్నాయని ఆలయ యంత్రాంగాన్ని అభినందించారు.

## భవానిపురంలో తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన పౌరసరఫరాల శాఖామంత్రి నాదెళ్ల మనోహర్



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 12 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం విజయవాడ , భవానీపురం రైతు బజారులో ప్రత్యేక కౌంటర్ల ద్వారా సబ్సిడీ సన్నబియ్యం విక్రయాలను ప్రారంభించారు. ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయ భాను,పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ , జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్ కన్న బాబు, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ తో కలిసి ప్రారంభించారుఈ సందర్భంగా నాదెళ్ల మనోహర్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్ లో పెరుగుతున్న నిత్యవసరాల ధరల నుండి సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.ఇప్పటికే రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా బి పీ టీ రకం సన్నబియ్యాన్ని అందిస్తున్నామని దానికి అదనంగా నేటి నుండి కే ఎన్ ఎం/ ఆర్ ఎన్ ఆర్ రకాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వినియోగదారులకు 26 కిలోల బ్యాగ్‌లలో లభ్యమయ్యేలా ఏర్పాట్లు చేశామన్నారు. బహిరంగ మార్కెట్లో నాణ్యమైన సన్న బియ్యం ధర కిలో రూ. 90 వరకు ఉన్న తరుణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నిర్ణయం సామాన్యులకు భారీ ఆర్థిక ఊరట నిస్తుందన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు..జనసేన నాయకులు మరుపిళ్ళ రాజేష్ , మహాదేవు అప్పాజీరావు, పెటేటి నాంచారయ్య, ఎ ఎస్ యన్ మూర్తి,తిరుపతి అనూష, తిరుపతి సురేష్, మల్లేపు విజయలక్ష్మి,బొల్లేపల్లి కోటేశ్వరరావు, బొమ్ము రాంబాబు, బొమ్ము గోవిందమ్మ, రెడ్డిపల్లి అనిత,మద్దిల రామక్రిష్ణ ,వెంపలి గౌరీ శంకర్, ఏలూరి సాయి శరత్, రౌతు వాసు, పల్లంటి ఆది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ బ్రహ్మా చారిణి దేవీ అలంకారం లో దర్శనం ఇచ్చిన శ్రీ దేవీ కరుమారి అమ్మన్





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 12 :(వార్త ప్రభ ప్రతినిధి)** శ్రీ దసరా శరన్నవరాత్రి మహోత్సవం-2026 లో భాగంగా మిల్క్ ప్యాక్టరీ సమేపంలో సీ వీ ఆర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న శ్రీ దేవీ కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో దసరా వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం రెండోవ రోజు శ్రీ దేవి కరుమారి అమ్మ వారుశ్రీ బ్రహ్మచారిణి దేవి రూపం లో దర్శనం ఇచ్చారు. “”దధానా కరపద్మాభ్యామక్షమాలా కమండలూదేవీ ప్రసీదతు మయి బ్రహ్మచారిణ్యనుత్తమా”” అంటూ మంత్ర జపంతో ప్రత్యేక హోమం నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలతో పాటుగా సామూహిక కుంకుమార్చన చేశారు. పీఠదిపతి శ్రీశ్రీశ్రీ కరుణానందనాథ స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకల్లో వందలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

## భక్తులతో పోటెత్తిన చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 12 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని చిట్టినగర్ శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీమహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానంలో దసరా శరన్నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆలయం భక్తులతో పోటేత్తింది. అమ్మవారు బాల లలిత త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులు దర్శనం చేసుకున్నారు. సుమారుగా 3000 మంది భక్తులు అమ్మవారు కృపాకటాక్షాలతో భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు పాల్గొన్నారు. భక్తులు భక్తి శ్రద్ధలతో దర్శించుకుని తీర్ధ ప్రసాదలు స్వీకరించారు. కమిటీ సభ్యులు అందరూ అమ్మవారి సేవలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వచ్చిన ప్రతి భక్తులకి ప్రసాదం పంపిణీ చేయడం జరిగింది. పాలకవర్గం కమిటీ అధ్యక్షులు పోతిన బేస్ కంతేశ్వరుడు సెక్రటరీ తొత్తడి భరత్, కోశాధికారి బెవర సుధాకర్, పొట్నూరి నాగేశ్వరరావు, కత్తెర సురేష్,రాంపిళ్ల వాసు, చొక్కర శ్రీనివాసరావు, ఈది బాబురావు, బాయన బెనర్జీ, గూడేల మణికంత, గర్రె భాస్కర్, తమ్మిన రఘు, చొక్కర చంద్రశేఖర్, మరియు కమిటీ సభ్యులు భక్తుల సేవలో పాల్గొన్నారు.

# జగన్మాత సన్నిధిలో సాంస్కృతిక వైభవం- కనకదుర్గా నగర్ కళావేదికపై అద్భుత ప్రదర్శనలు

**అమ్మవారి దివ్య సన్నిధిలో లయబద్ధమైన శాస్త్రీయ నృత్యాలు, సుమధుర భక్తి సంకీర్తనలు, రసవత్తర హరికథా గానం ఉదయం 10:30 నుండి సాంస్కృతిక రంజని- భక్తిపారవశ్యంలో మునిగితేలిన భక్తజనం**





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 12 :(వార్త ప్రభ ప్రతినిధి)** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీ కనకదుర్గా నగర్‌లోని ప్రత్యేక కళావేదికపై సోమవారం ఆధ్యాత్మిక, సాంస్కృతిక శోభ వెల్లివిరిసింది. హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా దేవస్థానం ఏర్పాటు చేసిన ఈ వేదికపై వివిధ కళా ప్రక్రియలలో నిష్ణాతులైన కళాకారులు ప్రదర్శించిన కార్యక్రమాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. ఉదయం 10:30 గంటల నుండి రాత్రి వరకు నిరంతరాయంగా సాగిన ఈ ప్రదర్శనలు ఇంద్రకీలాద్రి పరిసరాల్లో ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లాయి.

**కళా ప్రదర్శనల ప్రధాన విశేషాలు:** ఆధ్యాత్మిక కళా ప్రదర్శనల ప్రారంభంలో కె. రత్నకుమారి బృందం సమర్పించిన సాంప్రదాయ 'తాళం భజన' వేదిక ప్రాంగణాన్ని భక్తిభావంతో నింపింది. అనంతరం భక్తిరంజని విభాగంలో ఆలపించిన సంకీర్తనలు శ్రోతలను భక్తిసాగరంలో ఓలలాడించాయి. పి. సాత్విక్ మహాదేశ్వర్, శ్రావణ ప్రతాప్, యు. గంగాధర్, సిహెచ్. శ్రీదేవి, మరియు జె. శ్రీ వీణాధరి గానం చేసిన అమ్మవారి స్తోత్రాలు, అన్నమయ్య, త్యాగరాజ, రామదాసు కీర్తనలు, దేవీ స్తుతులు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

**భక్తిరసభరిత హరికథా గానం.** ప్రముఖ హరికథా కళాకారిణి వై. శిఖామణి సమర్పించిన హరికథా గానం సభికులను విశేషంగా రంజింపజేసింది. గానం, అభినయం, భావయుక్తమైన వాక్చాతుర్యంతో పురాణ గాథలను వివరిస్తూ సాగిన హరికథా కాలక్షేపం భక్తుల ప్రశంసలు అందుకుంది.

**నృత్య నీర్యాజనం -- శాస్త్రీయ నృత్యాల ఝరి:** మధ్యాహ్నం నుండి రాత్రి వరకు వేదికపై చిన్నారులు, యువ కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్య నృత్య రీతులు కనువిందు చేశాయి. కనకదుర్గ, డి. జాశ్రిత, ఎ. శోభ, కె.ఎల్. తన్విక, ఎ. శ్రీ వింధ్య, ఎం.ఎస్. ఆశ ప్రదర్శించిన శివ-పార్వతి స్తుతులు, మహిషాసుర మర్దిని స్తోత్ర నృత్యాలు అద్భుత హావభావాలతో ఆకట్టుకున్నాయి. సాయంత్రం వేళ టి. యోగ్యత లక్ష్మీ దుర్గ, కె. ఉష, ఆర్. ఉమా రాణి, టి. దివ్య స్రవంతి, ఎం. రాగిణి, పి. శ్వేత లయబద్ధమైన పాదవిన్యాసాలు, ముద్రలతో శాస్త్రీయ నృత్య సొగసులను వేదికపై ఆవిష్కరించారు. రాత్రి సమయంలో కళాక్షేత్ర డాన్స్ అకాడమీ బృందం సమర్పించిన సమూహ నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, అనంతరం ఎన్. తేజశ్రీ, ఎం. హేమకుమారి, ఇ. గాయత్రి ప్రదర్శించిన నృత్యాలతో కళా నీరాజనం కొనసాగింది. అమ్మవారి దర్శనం కోసం వచ్చి క్యూలైన్లలో మరియు కనకదుర్గా నగర్‌లో వేచి ఉన్న భక్తులు ఈ ప్రదర్శనలను తిలకిస్తూ ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ప్రదర్శనలు ముగించిన కళాకారులందరినీ దేవస్థాన అధికారులు ప్రత్యేకంగా అభినందించి, శ్రీ అమ్మవారి ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం నిర్వహిస్తాం..

**-జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**మచిలీపట్నం అక్టోబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి మీకోసం --ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక- కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చున్నారు. మీకోసం --ప్రజా సమస్యల పరిష్కార వేదిక కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చున్నారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్ సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. అలాగే అర్జీదారులు క్యూఆర్ కోడ్ ద్వారా కూడా స్పందన తెలియజేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆర్డీవోకార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ లు కూడా యధా విధంగా జరుగుతాయికావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కలెక్టర్ కోరారు.

# మచిలీపట్నం ఓడరేవుకు అనుబంధంగా సరకు రవాణా కేంద్రం

**కంటైనర్ సంస్థ అధ్యక్షుడితో ఎంపీ బాలశౌరి భేటీ**
**త్వరలో ఓడరేవును సందర్శించి ప్రాజెక్టు ప్రారంభానికి చర్యలు**



**మచిలీపట్నం అక్టోబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం నూతన ఓడరేవుకు అనుబంధంగా సరకు రవాణా, నిల్వ, తయారీ పరిశ్రమల కేంద్రం ఏర్పాటుకు ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషి చేస్తున్నారు. లోక్‌సభ అనుబంధ శాసనాల కమిటీ అధ్యయన పర్యటనలో భాగంగా జమ్మూ కశ్మీర్‌లో ఉన్న ఆయన, భారత కంటైనర్ సంస్థ అధ్యక్షుడు, నిర్వహణ సంచాలకుడు అజిత్ కుమార్ పాండాతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భారత కంటైనర్ సంస్థ మధ్య గతంలో కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం మచిలీపట్నంలో సమీకృత సరకు రవాణా, తయారీ పరిశ్రమల కేంద్రం ఏర్పాటు చేయాలని ఎంపీ కోరారు. ఓడరేవు నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నందున, సంస్థ కార్యకలాపాలను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సంస్థ అధ్యక్షుడు త్వరలో మచిలీపట్నం ఓడరేవును సందర్శించి, ప్రాజెక్టు ప్రారంభానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కేంద్రం ఏర్పాటుతో సరకు రవాణా, గిడ్డంగులు, పరిశ్రమల అభివృద్ధికి ఊతం లభించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. మచిలీపట్నం ఓడరేవును వాణిజ్య, పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఎంపీ బాలశౌరి చేస్తున్న ప్రయత్నాల్లో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

# జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ పీఠంపై ఉత్కంఠ!

**● జనరల్ మహిళకు రిజర్వేషన్.. కూటమి, వైసీపీలో ఎవరికి అవకాశం? ● శ్రీరామ్, సామినేని, రంగాపురం కుటుంబాల పేర్లపై చర్చ.. వైసీపీలోనూ పలువురు ఆశావహులు!**

**వార్తాప్రభ ప్రత్యేక రాజకీయ విశ్లేషణ**



**జగ్గయ్యపేట అక్టోబర్ 12 (వార్తప్రభ)** మున్సిపల్ చైర్మన్ పదవి జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో పట్టణ రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకుం టున్నాయి. ఇప్పటివరకు పురుష నాయకుల రాజకీయ ఆధిపత్యం చుట్టూ సాగిన చర్చలు ఇప్పుడు మహిళా అభ్యర్థుల ఎంపిక వైపు మళ్లాయి. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు కూటమి, వైఎస్సార్‌సీపీ ఎలాంటి వ్యూహాలను అనుసరిస్తాయన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**కూటమిలో ఆశావహులు ఎందరో.. అభ్యర్థి ఎవరనేది ప్రశ్న!**

జగ్గయ్యపేటలో కూటమి తరఫున చైర్మన్ అభ్యర్థి ఎంపికపై పలు పేర్లు ప్రచారంలో ఉన్నాయి. శ్రీరామ్ కుటుంబం నుంచి శ్రీరామ్ ధనుంజయ చినబాబు సతీమణి శ్రీవల్లి పేరు వినిపిస్తుండగా, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ సుబ్బారావు కుటుంబం నుంచి కూడా అభ్యర్థి బరిలోకి దిగుతారనే ఊహాగానాలు ఉన్నాయి. మరోవైపు, సామినేని కుటుంబం నుంచి రాజకీయాల్లో చురుగ్గా ఉంటున్న సామినేని ఉదయభాను సతీమణి విమలాబాను పోటీ చేస్తారా? అన్న చర్చ సాగుతోంది. అలాగే మాజీ మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సతీమణి పేరు కూడా తాజాగా తెరపైకి వచ్చింది. ఆమె చైర్‌పర్సన్ అభ్యర్థిగా బరిలోకి దిగుతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇక మాజీ మంత్రి నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్ధన్ వర్గాల నుంచి మాజీ కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి పేరు పరిశీలనలోకి వస్తుందా? అన్నది మరో చర్చనీయాంశం. ఇన్ని పేర్లు ప్రచారంలోకి రావడంతో కూటమి అభ్యర్థి ఎంపిక కీలకంగా మారింది. అయితే వీరిలో ఎవరైనా అధికారికంగా అభ్యర్థిత్వాన్ని ప్రకటించారా? అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

**వైఎస్సార్‌సీపీలోనూ అభ్యర్థి ఎంపికపై ఆసక్తి**

వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ వైస్ చైర్మన్ హాఫీ జున్నీసా పోటీకి దిగుతారా? లేక పార్టీ నాయకత్వం మరో మహిళా నాయకురాలికి అవకాశం కల్పిస్తుందా? అన్నది చర్చనీయాంశంగా మారింది. తన్నీరు నాగేశ్వరరావు వర్గం నుంచి, ఇంటూరి చిన్న వర్గం నుంచి అభ్యర్థులు తెరపైకి వస్తారా? కాపు సామాజిక వర్గం నుంచి ఎవరైనా మహిళా అభ్యర్థిగా ముందుకొస్తారా? అన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీలో అభ్యర్థి ఎంపిక విషయంలో స్థానిక నాయకుల అభిప్రాయాలు, పార్టీ అధిష్ఠానం నిర్ణయం కీలకం కానున్నాయి. అయితే ప్రస్తుతం ప్రచారంలో ఉన్న పేర్లలో ఎవరికి పార్టీ అధికారికంగా అవకాశం కల్పిస్తుందన్నది వేచి చూడాల్సిందే.

**కుటుంబ రాజకీయాలా? కొత్త ముఖాలకా అవకాశం?**

చైర్మన్ పదవి మహిళలకు రిజర్వ్ కావడంతో స్థానికంగా రాజకీయ అనుభవం ఉన్న నాయకుల కుటుంబాల నుంచి మహిళా అభ్యర్థులు ముందుకొచ్చే అవకాశాలపై చర్చ సాగుతోంది. మరోవైపు, పార్టీ కోసం పనిచేస్తున్న మహిళా నాయకులకు అవకాశం కల్పించాలన్న అభిప్రాయాలు కూడా ఉండవచ్చు. అయితే అభ్యర్థుల ఎంపిక కేవలం కుటుంబ నేపథ్యం ఆధారంగానే జరుగుతుందని చెప్పలేం. పార్టీ అంతర్గత సమీకరణాలు, స్థానిక నాయకుల అభిప్రాయాలు, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం, ఎన్నికల వ్యూహం వంటి అంశాలు కూడా నిర్ణయంపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

**అధిష్ఠానం నిర్ణయమే కీలకం!**

జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ పదవి జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో రెండు ప్రధాన రాజకీయ శిబిరాల్లోనూ అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. కూటమి నుంచి శ్రీరామ్ కుటుంబం, సామినేని కుటుంబం, రంగాపురం రాఘవేంద్ర కుటుంబం, కన్నెబోయిన రామలక్ష్మి పేర్లు చర్చలో ఉండగా, వైఎస్సార్‌సీపీలో హాఫీ జున్నీసాతో పాటు ఇతర వర్గాల నుంచి ఎవరైనా ముందుకొస్తారా అన్న ఆసక్తి నెలకొంది. చివరకు ఎవరి పేరు ఖరారవుతుంది? కూటమి ఏకాభిప్రాయంతో అభ్యర్థిని ఎంపిక చేస్తుందా? వైఎస్సార్‌సీపీ కొత్త పేరును తెరపైకి తీసుకొస్తుందా? అనే ప్రశ్నలకు పార్టీల అధికారిక ప్రకటనలతోనే సమాధానం లభించనుంది. జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థుల ఎంపికపై రాబోయే రోజుల్లో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు ప్రచారంలో ఉన్న పేర్లన్నీ ఊహాగానాలుగానే చూడాలి.

**వార్తాప్రభ । జగ్గయ్యపేట రాజకీయ ప్రత్యేక కథనం**

# పేటలో వీఆర్ఏల వినూత్న నిరసన



**అనుమసముద్రంపేట సెప్టెంబర్ 12 (వార్తాప్రభ ప్రతినిధి)** తమ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ ఏఎస్ పేటలో వీఆర్ఏలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత 27 రోజులుగా దీక్షా శిబిరాల్లో వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా దీక్షా శిబిరంలో వీఆర్ఏలు సోమవారం ఒంటికాలిపై నిలబడి నిరసన చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ నిరసన కార్యక్రమాలు వివిధ రూపాల్లో ఇంకా ముందుకు తీసుకెళ్తామన్నారు. మండల వీఆర్ఏల సంఘ అధ్యక్షుడు రామకృష్ణ కార్యదర్శి సునీల్ ఉపాధ్యక్షుడు వెంకటరమణ మండలంలోని అందరు విఆర్ఏలు పాల్గొన్నారు.

# అయాన్ ఆసుపత్రి వార్షికోత్సవ సంబరాలు.

**12 సం"గా డాక్టర్ బషీర్ సేవలు..**




**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 12 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పంజా సెంటర్ ప్రాంతంలో అయాన్ కంటి ఆసుపత్రి స్థాపించి డాక్టర్ బషీర్ 12 వసంతాలు పూర్తి చేసుకున్నారు. డాక్టర్ బషీర్ గత 12 సంవత్సరాలుగా వేలాదిమంది ప్రజలకు మందగించిన చూపుల నుండి వెలుగులు నింపారు. అంతేకాకుండా నయనం ప్రధానం అంటారు, మనిషి జీవితంలో కళ్ళు అతి ముఖ్యమైనవి, దేవుడు తర్వాత అంత గొప్ప వ్యక్తులు డాక్టర్లే. డాక్టర్ బషీర్, అప్పటినుండి ఇప్పటివరకు తిరుగులేని వైద్యుడిగా పేరు సంపాదించుకున్నారు. అంతేకాకుండా ఎందరో జీవితాల్లో వెలుగు నింపి కంటి చూపుకు శస్త్ర చికిత్సలను అందించారు. సోమవారం12/10/2026వ తేదీ నాటికి కంటి ఆసుపత్రి 12సంవత్సరాలు నిండిన సందర్భంలో, అయాన్ కంటి ఆసుపత్రిలో వార్షికోత్సవ సంబరాలు జరిగాయి. అంతేకాకుండా ఈ 12 సంవత్సరాలలో సుమారుగా 50వేల సర్జరీలు చేశారని తెలిపారు, డబ్బే ప్రధానము అనుకోకుండా ప్రజలకు సేవ చేయడమే ముఖ్యమనుకొని వైద్య రంగంలోకి అడుగుపెట్టిన దగ్గర నుండి తిరుగులేని వైద్యుడిగా మంచి పేరు తెచ్చుకున్న అయాన్ కంటి ఆసుపత్రి నిర్వహణకులు డాక్టర్ బషీర్. విజయవాడ మరియు చుట్టుపక్కల ప్రాంతాల వారికి అతి తక్కువ ధరలో అత్యాధునిక టెక్నాలజీతో ప్రజలకు కంటి వైద్య సేవలు అందిస్తున్నట్టు డాక్టర్ బషీర్ అహమ్మద్ తెలిపారు.

# వైభవంగా శ్రీ దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభం...



**పెనుగంచిప్రోలు - అక్టోబర్ 12( వార్త ప్రభ )** శక్తి స్వరూపిణి ,దయారూపిని, దుఃఖమోచని, జగదానంద జగదేక ప్రపూజిత కనకదుర్గమ్మ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మండలం లో ఆదివారం నుంచి అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పెనుగంచిప్రోలు మండల కేంద్రం లో అంబేద్కర్ డౌన్ సెంటర్ లో శ్రీ కనక దుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రెండవ రోజు శ్రీ గాయత్రి దేవి గా భక్తుల కు దర్శనం ఇస్తున్నారు, మండల స మై ఖ్య అధ్యక్షురాలు కర్ల కోటేశ్వరి అమ్మ వారి దీక్ష తీసుకోని అమ్మ ను దర్శించు కున్నారు, అలాగే సత్రం సెంటర్ యాద వపల్లె, ముత్యాలమ్మ సెంటర్ చౌదరి బజార్ తూర్పు మాలపల్లి అంబేద్కర్ సెంటర్ లో అమ్మ వారి విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుంది అలాగే తోటచర్ల గ్రామం లోని సొసైటీ సెంటర్ లోను, పాత పంచాయతీ ఆఫీసు సెంటర్ లోనూ ఆయా కమిటీ సభ్యులు ప్రత్యేక పందిళ్లు వేసి, కనకదుర్గమ్మ విగ్రహాలను ఏర్పాటు చేశారు. తొలి రోజు దుర్గమ్మ అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు .బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మ దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించి భక్తులు తరించారు .సోమవారం దుర్గమ్మ అమ్మవారు గాయత్రి దేవిగా దర్శనమిచ్చారు .వేద పండితులు తమ్మర శివరామకృష్ణ శాస్త్రి ఆధ్వర్యంలో జవ్వాజి శ్రీనివాసరావు ,ప్రమీల దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమ అర్చనలు అత్యంత భక్తి శ్రద్ధలతో చేశారు .భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తన్మయలై నారు. అనంతరం భక్తులకు కమిటీ వారు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు .భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు ,పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలను పకడ్బందీగా నిర్వహించారు. బాల గణేష్ ఉత్సవ కమిటీ వారు గత పది సంవత్సరాల నుండి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం విశేషం . ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. భక్తులు బాల గణేష్ ఉత్సవ కమిటీ వారిని ప్రత్యేకంగా అభినందించారు. తూర్పు మాలపల్లి అంబేద్కర్ సెంటర్ లో సోమవారం రాత్రి 5 వం దల మంది భక్తుల కు కనక దుర్గమ్మ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించడం జరిగింది..

# వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



**రెడ్డిగూడెం, అక్టోబర్ 12(వార్తాప్రభ ప్రతినిధి ):** రెడ్డిగూడెం మండల కేంద్రంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ మరియు ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిరుపేదలైన వృద్ధులకు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర మోనటరింగ్ కో-ఆర్డినేటర్ బి సరోజినిదేవి మాట్లాడుతూ వృద్ధులను తమ బిడ్డలు ప్రేమతో చూడాలని, అలాగే వృద్ధులు తమ ఆరోగ్యం జాగ్రత్త చూసుకోవాలని సూచించారు. రాబోయే శీతాకాలంలో చలి నుంచి రక్షణ కోసం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు చాట్ల విజయకుమార్, కార్యదర్శి హన్న తదితరులు పాల్గొన్నారు.

# ఫోక్ సాంగ్ ప్రోమో విడుదల చేసిన బిజెపి నేత వడ్డేపల్లి



**కూకట్ పల్లి, అక్టోబర్12(వార్తా ప్రభ):** తెలంగాణ ప్రైవేట్ సాంగ్ ఆల్బమ్ "నా రంగరాజు బంగారు బావ" ప్రోమోను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆల్బమ్ నిర్మాతలు శ్రీనివాస్ మహారాజ్, రేవంత్ మహారాజ్‌ల ఆహ్వానం మేరకు వారి సమక్షంలో విడుదల చేశారు. ఈ పాటను విగ్నేష్ ఫోక్ సాంగ్స్ యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రేక్షకుల ముందుకుతీసుకువస్తున్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, ఆల్బమ్ రూపకల్పన కోసం కృషి చేసిన నిర్మాతలు, కళాకారుల శ్రమకు తగిన గుర్తింపు లభించాలని ఆకాంక్షించారు. యువత తమలోని ప్రతిభను గుర్తించి, సంగీతం, సినిమా, డిజిటల్ మీడియా వంటి వివిధ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుంటూ తమ ప్రతిభతో ఎదగడమే కాకుండా, సమాజంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా, "నా రంగరాజు బంగారు బావ" పాటను ప్రేక్షకులందరూ వీక్షించి, లైక్ చేసి, విగ్నేష్ ఫోక్ సాంగ్స్ యూట్యూబ్ ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకుని, తమ ఆదరణను అందించాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు. కళాకారులను ప్రోత్సహించడం ద్వారా వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని, మరిన్ని మంచి పాటలు, సృజనాత్మక కార్యక్రమాలు రూపొందించేందుకు ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. అనంతరం ఆల్బమ్ నిర్మాతలు శ్రీనివాస్ మహారాజ్, రేవంత్ మహారాజ్‌లకు ఈ ఆల్బమ్ మంచి విజయం సాధించి, ప్రేక్షకుల ఆదరణ పొందాలని, భవిష్యత్తులో మరిన్ని విజయవంతమైన కార్యక్రమాలు చేపట్టాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# కేపీహెచ్‌బీ ఫోరం మాల్..... రెయిన్ ట్రీ పార్క్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై అసాంఘిక శక్తుల అడ్డా

**కేపీహెచ్‌బి ఫోరం మాల్ - రెయిన్ ట్రీ పార్క్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని పరిశీలించిన 'స్వచ్ఛ భారత్ అభియాన్' ప్రతినిధులు.**





**కూకట్ పల్లి, అక్టోబర్12 (వార్తా ప్రభ)** అసాంఘిక శక్తుల అడ్డాగా మారిన వంతెనపై అధికారుల దృష్టికి సమస్యలు తక్షణ పరిష్కారానికి డిమా ండ్ కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలోని ఫోరం మాల్ (నెక్సస్ మాల్) మరియు మలేషియన్ టౌన్‌షిప్ (రెయిన్ ట్రీ పార్క్) ఎదురుగా ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్.ఓ.బి.) నిర్వహణ లేక తీవ్ర దుస్థితికి చేరింది. పాదచారుల భద్రత కోసం ఏర్పాటు చేసిన ఈ వంతెన ప్రస్తుతం ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా, ప్రమాదకరంగా మారడంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనిచేయని లిఫ్టులువృద్ధులు, మహిళలు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన లిఫ్ట్ గత చాలా కాలంగా నిరుపయోగంగా ఉంది.?అపరిశుభ్రత, అసాంఘిక కార్యకలాపాలు మెట్లు ఎక్కి వెళ్దామంటే అక్కడ తీవ్ర అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. రాత్రి వేళల్లో గంజాయి, మద్యం సేవించే అసాంఘిక శక్తులకు ఈ బ్రిడ్జి స్థావరంగా మారింది. చీకట్లో వంతెన బ్రిడ్జిపై లైటింగ్ సదుపాయం లేకపోవడంతో మహిళలు, విద్యార్థినులు అటువైపు వెళ్లాలంటేనే భయపడుతున్నారు ప్రాణాలకు ముప్పు తెస్తున్న రహదారి దాట్లు సాయంత్రం, రాత్రి వేళల్లో బస్సులు, క్యాబ్‌లలో అవతలి వైపు దిగే మహిళలు, యువతులు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఉపయోగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జిపై భద్రత లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై డివైడర్ దాటుతూ ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ అభియాన్ ప్రతినిధులునర్వ పవన్, తోట రమేష్, రేవతి, స్వర్ణ, గాయత్రి, వెంకటరమణ యాదవ్, తోట రాజశేఖర్, జగన్ తదితరులు పాల్గొన్నారు

# సిఇసి జ్ఞానేష్ కుమార్ ను విధులనుండి తొలగించాలి..

- 2023 ఎన్నికల చట్టాన్ని రద్దు చేసి, కేంద్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ఆపాలి.
- సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల డిమాండ్.




**మహబూబాబాద్ / తొర్రూరు అక్టోబర్ (వార్తాప్రభ):** సీసీ గణేష్ కుమార్ ను విధుల నుండి తొలగించాలని, 2023 ఎన్నికల చట్టాన్ని తక్షణమే రద్దుచేసి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ నిర్బంధాన్ని వెంటనే ఆపేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సమ్మెట రాజమౌళి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గుణిగంటి రాజన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్యలు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘ ల ఆధ్వర్యంలో సిఇసి జ్ఞానేష్ కుమార్ ను విధులనుండి తొలగించాలని. 2023 ఎన్నికల చట్టాన్ని రద్దు చేయాలని. కేంద్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ఆపాలని డిమాండ్ తో వ్యవసాయ మార్కెట్ దగ్గర రాస్తారోకో సిఐటియు పట్టణ కార్యదర్శి కుమ్మరి కుంట్ల నాగన్న అధ్యక్షతన నిర్వహించిన నిరసన రాస్తారోకో కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతుందని జ్ఞానేశ్ కుమార్ ను మోడీ ఎంతో కాలం కాపాడలేరని అన్నారు. ప్రజా ఉద్యమాలను నిర్బంధంతో కేంద్ర ప్రభుత్వం ఆపాలని చూడడం అవివేకం అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా పోరాటాలను అన్నివేసే హక్కు మోడీకి లేదన్నారు. ఢిల్లీలో కొనసాగిన అణచివేత అరెస్టులను ఖండించారు. రాజ్యాంగ బద్దంగా పనిచేయవలసిన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం జేబు సంస్థగా మార్చుకొని సర్ పేరుతో ఓట్లను తొలగించే దానిలో భాగంగా దేశంలో 13 కోట్లు తెలంగాణ రాష్ట్రంలో ఒక కోటి తొలగించే దుర్మార్గమైన కార్యక్రమం తీసుకుందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే ఈ చర్యను అనేక ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. వెంటనే సిఇసి జ్ఞానేశ్ కుమార్ ను విధుల నుండి తొలగించాలని సర్ ను రద్దు చేయాలని నిర్బంధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు లేనివెడల పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తా మని హెచ్చరించారు.

**జ్ఞానేష్ కుమార్ ను రాజీనామా చేయించి దేశద్రోహిగా ప్రకటించాలి...** దేశంలో అక్రమంగా 13 కోట్ల ఓట్లను తొలగించిన




కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తో రాజీనామా చేయించి, దేశద్రోహిగా ప్రకటించాలని ప్రజాసంఘాల నాయకులు బొల్లం అశోక్, ఎండి యాకూబ్ , జమ్ముల శ్రీనివాస్ లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తొర్రూరు మండల కేంద్రం లో సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తోరూర్ లో గాంధీ సెంటర్లో నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతుందని, ఇందిరాగాంధీ హయాంలో జరిగిన ఎమర్జెన్సీ ఇప్పుడున్న యువత ఎవరు చూడలేదని కానీ నరేంద్ర మోడీ ఎమర్జెన్సీ మాత్రం ఢిల్లీ జంతర్ మంతర్ లో జరుగుతున్న ఘటనలు కండ్లకు కట్టినట్టుగా కనిపిస్తుందని వారి సందర్భంగా గుర్తుకు చేశారు. ఈ దేశంలో పుట్టిన పౌరుల ఓటు హక్కు ఎలాంటి కారణం చెప్పకుండా కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దేశంలోని 13 కోట్ల ఓట్లను అక్రమంగా తొలగించారు. దాని గురించి అడిగితే అధికారంలో ఉన్న బిజెపి పార్టీ ప్రశ్నించిన వారిని దేశద్రోహులని, ఇతర దేశస్తులని కుట్రపన్నీ దేశద్రోహశీ కేసులు పెడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు ఓట్ల విషయంలో అవినీతికి పాల్పడిన జ్ఞానేష్ కుమార్ ను వెంటనే రాజీనామా చేపిచ్చి దేశద్రోహిగా ప్రకటించాలని, చట్టపరమైన తగు చర్యలు తీసుకొని జైల్లో వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనియెడల రానున్న రోజుల్లో ప్రజా సంఘాలు వామపక్ష పార్టీలు ప్రజలందరిని కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## వైభవోపేతంగా ప్రారంభమైన "నాదబ్రహ్మోత్సవ - 26" ఉత్సవాలు







**. శేరిలింగంపల్లి,అక్టోబరు 12 (వార్తాప్రభ):** అన్నమాచార్య భావనా వాహిని ఆధ్వర్యంలో అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న నాదబ్రహ్మోత్సవం--26 ఉత్సవాలు ఆదివారం నృత్యార్చనతో ప్రారంభమయ్యాయి.దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అక్టోబరు 11 నుంచి 20 వరకు పది రోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి.తొలిరోజు ఆధ్యాత్మిక ప్రవచనాలు, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.విజయవాడకు చెందిన ట్రూత్ స్పిరిచువల్ ఆర్గనైజేషన్ గురువు శ్రీ వివేకానంద గురు ముఖ్య అతిథిగా పాల్గొని సత్యం, నిజం మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. ఇంద్రియాలతో గ్రహించేది నిజమని, ఇంద్రియాలకు అతీతమైనదే సత్యమని పేర్కొన్నారు.సత్యాన్ని తెలుసుకున్నవారు ఉన్నత మార్గంలో పయనిస్తారని తెలిపారు.డాక్టర్ రంగనాథం మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశీస్సులు, శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతోనే తాను ఈ స్థాయికి చేరుకున్నానన్నారు.ప్రతిరోజూ ఆసుపత్రికి వెళ్లే ముందు శ్రీమహావిష్ణువును ప్రార్థించి, తన వద్దకు వచ్చే రోగులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటానని చెప్పారు.ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన డా. నందకుమార్,శోభ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం యుక్తా రెడ్డి బృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. ఆనంద నర్తన గణపతిం, లక్ష్మీ స్తుతి, బృందావన తిల్లానా, కృష్ణాష్టకం, గరుడ గమన, చక్కని తల్లికి, కుండ నృత్యం, అయ్యిగిరి నందిని, శ్రీ లలిత హారతి తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించారు.ఆద్య, రూప,కృతినయన, మౌక్తిక, హాసిని, సిద్ధి,అక్షర, కృతిక, సాన్వి, వేదాంశి, లాస్య, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.ఉత్సవాల్లో ప్రతిరోజూ సాయంత్రం 4.30 గంటలకు విష్ణు సహస్రనామం,లక్ష్మీ అష్టోత్తరం,అన్నమాచార్య అష్టోత్తరం, లలితా సహస్రనామ పారాయణాలు నిర్వహించనున్నారు.తొలిరోజు రాత్రి 8.30 గంటలకు హారతి, ప్రసాద వితరణతో కార్యక్రమాలు ముగిశాయి.సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డా. నందకుమార్, ఛైర్మన్ పి.పి. రాజ్ ఉత్సవాల్లో భక్తులు, సంగీతాభిమానులు, కళాప్రియులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## "యాదవ రాజుల వీరగాథలు" పుస్తకావిష్కరణ మహోత్సవం





**ఒంగోలు, అక్టోబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** యాదవుల చరిత్ర, సంస్కృతి, శౌర్య పరాక్రమాలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో రచించిన "యాదవ రాజుల వీరగాథలు" పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం విజయవంతంగా జరిగింది. కార్యక్రమంలో పాలేటి గంగమ్మ ఆలయ పూజారులు బొడ్డుబోయన బ్రహ్మయ్య, బొడ్డుబోయన గంగయ్య, గుంటి గంగమ్మ ఆలయ పూజారి బాలు యాదవ్ లతో పాటు అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర నాయకులు శేషఫని యాదవ్, మోహన్ యాదవ్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ నాగమ్మ, రిటైర్డ్ హెచ్.ఎం. బద్రి,యాదవ ప్రముఖులు బొట్ల సుబ్బారావు యాదవ్, కొత్తగర్ల వెంకతెశ్వర్లు,రావులపల్లి వెంకట సుజాత, కూర్మారావు,పెద్దన్న,బొమ్మి నాగ కిషోర్,ఎస్.ఎస్. యాదవ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ, విచ్చేసిన పెద్దలకు, యాదవ సంఘ నాయకులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరునా రచయిత శ్రీ బంక దత్తాత్రేయ యాదవ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూమన చరిత్రను తెలుసుకుందాం -- మన వారసత్వాన్ని కాపాడుకుందాం,చరిత్రను భావితరాలకు అందించడమే మన లక్ష్యం అని పిలుపునిచ్చారు

## శిల్పా రామములో సందర్శకులను ఆకట్టుకున్న బతుకమ్మ ఉత్సవాలు







**శేరిలింగంపల్లి,అక్టోబరు 12 (వార్తాప్రభ):** మాదాపూర్ శిల్పారామంలో బతుకమ్మ పండుగ మూడో రోజు వేడుకలు ఉత్సాహంగా జరిగాయి.శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మలను పేర్చి, సాయంత్రం సందర్శకులతో కలిసి బతుకమ్మ ఆటలు ఆడారు. సంప్రదాయ పండుగ వాతావరణం సందర్శకులను ఆకట్టుకుంది.అనంతరం యాంఫీ థియేటర్‌లో తాల్ తరంగ్ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి.ఎన్ఎస్ఎల్ ప్రవీణ శిష్య బృందం ప్రదర్శించిన 'ఆధ్య నవరూపిణి' నృత్యరూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.అమ్మవారి తొమ్మిది రూపాలను వర్ణిస్తూ కళాకారులు చేసిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను మెప్పించింది. అమృత, సంజన, శాన్వి, శ్రేష్ఠ, సుష్మ, కల్యాణి, చక్రిక, తన్విక, సౌమ్య, గ్రీష్మ, మానస తదితరులు పాల్గొని తమ ప్రతిభను చాటారు.

## రెండవ రోజు గాయత్రీ దేవిగా అమ్మవారు సాక్షాత్కారం

### కిలేస్ పురం గ్రామంలో అమ్మవారికి సారె సమర్పించిన రామినేని రాజా



**ఇబ్రహీంపట్నం,అక్టోబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండల పరిధిలోని కిలేస్ పురం గ్రామంలో గల శ్రీ శ్రీ శ్రీ గంగానమ్మ అమ్మవారి శరన్నవరాత్రులు ఆదివారం వైభవంగా ప్రారంభించారు. దసరా మహోత్సవాల్లో సందర్భంగా తొమ్మిది రోజుల శరన్నవరాత్రులు జరగనున్నాయి. మొదటిరోజు బాలా త్రిపుర సుందరి, రెండో రోజు గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు అమ్మవారు దర్శనమివ్వనున్నారు. గ్రామంలోని బొడ్డు రాయి వద్దనుండి సారే ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు రామినేని రాజా.9 రోజులపాటు వివిధ రూపాలలో దర్శించి అమ్మవారికి అలంకరణ సారె సాంప్రదాయబద్ధంగా అందించనున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా జరగనున్నాయి. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందవలసిందిగా ఆలయ అభివృద్ధి సంఘం విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నైతికత...నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 12 :(వార్త ప్రభ ప్రతినిధి)** విద్యార్థులు నైతిక విలువలను, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని అడుగులు వేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థుల రెండో గ్రాడ్యుయేషన్ వేడుకలు ఆ కళాశాల ఆవరణలో సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఉన్నత విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు సమాజ హితాన్ని కాంక్షిస్తూ ముందుకు సాగాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరారు. మరో అతిథిగా హాజరైన ఎన్ఐటీ ఢిల్లీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిశోధన, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై విద్యార్థులు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు తమతమ రంగాల్లో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రధానంగా విద్యార్థులు నిరంతర శ్రమ, క్రమశిక్షణతో అడుగులు వేయాలని సూచించారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు చలవాది మల్లికార్జునరావు, చిట్టా అమర్‌సుధీర్‌లు మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య, ఉపాధ్యక్షులు పొట్టి సురేంద్రకుమార్, సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

## విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డులో ఘోర ప్రమాదం

### డివైడర్‌ను ఢీకొనడంతో ఈవీ కారులో చెలరేగిన మంటలు

### కారులో మంటలు నలుగురు సజీవదహనం



**గొల్లపూడి, అక్టోబర్ 12(వార్తా ప్రభ ప్రతినిధి):** విజయవాడ వెస్ట్ బైపాస్ పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. సేకరించిన వివరాల ప్రకారం విజయవాడ వెస్ట్ బైపాస్ పై వెళుతున్న కారు అదుపుతప్పి డివైడర్ ను ఢీకొనడంతో కారులో మంటలు చెలరేగాయి. ఒకసారిగా మంటలు చెలరేగటంతో తప్పించుకునే వీలు లేక కారులో ప్రయాణిస్తున్న నలుగురు సజీవదహనం అయ్యారు.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరొక వ్యక్తి పరిస్తితి విషమం ఉన్నట్లు తెలుస్తోంది.నంబూరులో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా విషాదం నెలకొంది.మృతులు నున్న, నంబూరు వాసులుగా పోలీసులు గుర్తించారు.మృతుల్లో నున్నకు చెందిన కొమ్మారెడ్డి రాందేవ్ (39), ఆయన తల్లి అరుణ ఉన్నారు.సమాచారం అందుకుని సహాయక చర్యలు చేపట్టిన పోలీసులు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

**ఎంఎంసీ కమిషనర్‌ను కోరిన ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ పరమేశ్వర్‌రెడ్డి.**





**కాప్రా, అక్టోబర్ 12(వార్తా ప్రభ):** ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి కోరారు. సోమవారం మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డిని పరమేశ్వర్‌రెడ్డి కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్, కాప్రా, నాచారం సర్కిళ్ల పరిధిలో కొన్ని ముఖ్యమైన అభివృద్ధి పనులను తక్షణమే చేపట్టాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి గుర్తు చేశారు. పలు ప్రాంతాల్లో సరైన రహదారులు లేవని, అవసరమైన చోట్ల కమ్యూనిటీ హాళ్లు కూడా లేవన్నారు. ప్రస్తుతం ఉన్న రహదారులు చాలా కాలంగా నిర్మించకపోవడం వల్ల దెబ్బతినడంతో స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీటిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్టుగా పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్ శివమణి, పావని రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కంది శ్రవణ్ రెడ్డి, శ్రీహరి, టిల్లు యాదవ్, విఠల్ నాయక్, నాగరాజు, బాబు రావు, నాగశేషు, మల్లా రెడ్డి, కిషోర్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైతికత...నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 12 :(వార్త ప్రభ ప్రతినిధి)** విద్యార్థులు నైతిక విలువలను, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని అడుగులు వేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థుల రెండో గ్రాడ్యుయేషన్ వేడుకలు ఆ కళాశాల ఆవరణలో సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఉన్నత విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు సమాజ హితాన్ని కాంక్షిస్తూ ముందుకు సాగాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరారు. మరో అతిథిగా హాజరైన ఎన్ఐటీ ఢిల్లీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిశోధన, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై విద్యార్థులు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు తమతమ రంగాల్లో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రధానంగా విద్యార్థులు నిరంతర శ్రమ, క్రమశిక్షణతో అడుగులు వేయాలని సూచించారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు చలవాది మల్లికార్జునరావు, చిట్టా అమర్‌సుధీర్‌లు మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య, ఉపాధ్యక్షులు పొట్టి సురేంద్రకుమార్, సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ దేవాలయంలో ఘనంగా ప్రారంభమైన దసరా మహోత్సవాలు.





**ప్రొద్దుటూరు, అక్టోబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలుగు రాష్ట్రాలలో యాదవులకు ప్రతిష్టాత్మకమైన పొద్దుటూరులోని "శ్రీకృష్ణ ఆలయం"లో యాదవ సేవా సంఘం వారి తరఫున దసరా మహోత్సవమును ఘనంగా ప్రారంభమై నాయి. మొదటి రోజు మత్స్యావతారంతో ప్రారంభమై, కల్కి అవతారం తో దసరా రోజు ముగుస్తుంది. ఈ పూజా కార్యక్రమాలలో అధ్యక్షులు దాసరి బాల సుబ్బరాయుడు యాదవ్, వ్యవస్థాపక అధ్యక్షులు పామిడి రామసుబ్బన్న యాదవ్ ,బత్తుల చిన్న నాగన్న యాదవ్ మరియు కమిటీ సభ్యులు కార్యవర్గ సభ్యులందరూ, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల విశేషంగా హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు.దసరా ప్రొద్దుటూరు లో విశెసంగా జరుగును, మైసూరు లో దసరా భారతదేశంలో బ్రహ్మండంగా జరుగుతుంధని ప్రసిద్ధి. ఆ తర్వాత ప్రొద్దుటూరు లోనే అంత ప్రాముఖ్యత దసరా కు ఉంది. ఈ దేవాలయం లో విశేషంగా పూజ కార్యక్రమాలు జరిగాయి.ప్రతి కుటుంబం తమ కుటుంబ సభ్యులు ను పిలిపించుకొని దసరా పండుగ జరుపుకుంటారు, ఎగ్జిబిషన్ రెండు కోట్ల ఇరవై లక్షలు తో మున్సిపాలిటీ వారికి చెల్లించి ఏర్పాటు చేశారు.

# శ్రీ తిరుపతమ్మ అమ్మవారి భక్తుల సౌకర్యాలకు ప్రధమ ప్రాధాన్యం

### పాలకవర్గం సాధారణ సమావేశం లో తీర్మానం....



**పెనుగంచిప్రోలు - అక్టోబర్ 12( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు గ్రామంలోవేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ దేవస్థానం ప్రాంగణము లో ,పలు అభివృద్ధి కార్యక్రమాలకు పలు సాంకేతిక విధులకు శ్రీ తిరుపతమ్మ దేవస్థానం తీసుకునే తీర్మానాల్లో భాగంగా దేవస్థానం. ఈవో జీ.వి.డీ.ఎస్. లీలా కుమార్, చైర్మన్ చుంచు రమేష్ బాబు, పాలకమండలి సభ్యులు ఆధ్వర్యంలో పలు తీర్మానాలు ఆమోదించడం జరిగింది. సమావేశంలో 1, నుండి 12,తీర్మానాలు ఆమోదించడం జరిగింది. తీర్మానం వివరములు ::...1) శ్రీ అంకమ్మ వారి వెండి తుపడము. యొక్క ఖాతా నందు. సొమ్మును పరిశీలించి. తాపడము చేయుటకు అంచనా తయారు చేయుటకు. సదరు సొమ్మును సరిపోని ఎడల దేవస్థానం స్టాండింగ్ రూమ్. నందు నిరుపయోగముగా ఉన్న వెండి ఎంత ఉన్నది , ఖాతాదారులు ద్వారా కట్టిన మొత్తం ఎంత ఉన్నది వివరముల గురించి ఆమోదించియున్నారు. 2)శ్రీ అమ్మవారి దేవస్థానం మూడు సంవత్సరముల ఆదాయలు. పరిశీలించి ప్రస్తుత,( డీసీ ) కేడర్ నుండి. ( ఆర్.జే.సీ.) క్యాడర్.గా మార్పు చేయుట గురించి, తీర్మానములు ఆమోదించి ఉన్నారు 3) శ్రీ అమ్మవారి భక్తులకు క్యూలైన్ నందు మినరల్ వాటర్ ఏర్పాటు చేయుటకు గురించి, తీర్మానం ఆమోదించి ఉన్నారు. 4) శ్రీ అమ్మవారి దేవస్థానం గోశాల షెడ్ లు రిపేరు చేయుట గురించి, తీర్మానం. 5 ) శ్రీ అమ్మవారి దేవస్థానం ప్రాంగణము నందు నిరుపయోగంగా ఉన్న వస్తువులు (స్కాప్)ను, వేలము నిర్వహించుట కు గురించి తీర్మానం.6). అమ్మవారి యూగశాల. ప్రస్తుతము ఉన్న దానిని ఎక్కువ గాలి వీచు విధానం గా కిటికీలు ఏర్పాటు, గురించి తీర్మానము. 7). అమ్మవారి దేవస్థానము లోపల భాగముఉన్నటువంటి.200/-క్యూ లైన్ పక్కన లాంన్ సత్రముల ముందరి భాగమున పూల మొక్కలు వేచుట. గురించి తీర్మానం. 8) అమ్మవారి అన్నప్రసాదాలు ద్వారా సదరు విరాళములు, ఎంత ఉన్నవి వివరముల గురించి తీర్మానం.9). అమ్మవారి దేవస్థానం దక్షిణ భాగము ఉన్న ప్రస్తుతము దేవస్థానం సెంట్రల్ స్టోర్ కి అభిముఖము గా ఉన్న ఖాళీ ప్రదేశంలో సిబ్బందికి. (టాయిలెట్స్.పార్కింగ్ )చేయుట కొరకు. అంచనా తయారు చేయుట తీర్మానం. 10) ఆరు లడ్డూ లు బాక్స్.ల ఎస్ట్. టెండర్లు. వేయించుట కొరకు, తీర్మానం.11) రస వర్గాలకు సంబంధించి,ఎస్ట్. టేండర్లు వేయుటకు తీర్మానం.12)గోశాలలో పనిచేయు చున్నవారికి అదనంగా. ముగ్గురు కూలీలని ఏర్పాటు చేయుట కొరకు. కలెక్టర్ వారి. (ఎస్ ఎస్ ఆర్) రేటు ప్రకారము.ఆమోదము పొందాయి. ఒకటి నుండి 12 వరకు పాలు తీర్మానాలు దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి చైర్మన్ పాలకవర్గం మండల సభ్యులు దేవస్థానం సిబ్బంది ఆధ్వర్యంలో తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు పాలకవర్గ సభ్యులు . కొలిపాక హైమావతి.గుగులోతు రమేష్. కల్లూరి శ్రీవాణి .తన్నీరు గోపీనాథ్.గజ్జి.పెద్దఆంజనేయులు. పీ.అనసూర్య. పీ. జ్యోతి ప్రియాంక. ఓ. సూరమ్మ. కర్నాటి కవిత. సి. అప్పారావు. కే. విజయలక్ష్మి. శనగవరపు వెంకటేశ్వరరావు. మరియు దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...

## కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శరన్నవరాత్రులు



గుడివాడ,అక్టోబర్ 12 (వార్తాప్రభ) : స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారు శ్రీ కన్యాకుమారి దేవి అలంకారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనుబంధ ఆలయాల్లో శ్రీ నగరేశ్వర స్వామివారు నందీశ్వర సహిత మహేశ్వరుడి అవతారంలో, శ్రీ జనార్దన స్వామివారు శ్రీకృష్ణ అవతారంలో దర్శనమిచ్చారు. ఈ నెల 20వ తేదీ వరకు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయని దేవస్థాన పాలకవర్గ అధ్యక్షులు, పట్టణ వైశ్య సంఘం అధ్యక్షులు జవ్వాజి గంగరాజు తెలిపారు. భక్తులందరూ విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## సేవకు 244 మైలురాయి..
## మోటూరులో జాగృతి క్లబ్ చేయూత



గుడివాడ,అక్టోబర్ 12 (వార్తాప్రభ) : నిరుపేద కుటుంబానికి అండగా నిలిచింది వాసవి జాగృతి క్లబ్. ప్రతి అమావాస్య నాడు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా 244వ సేవా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మోటూరు గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద బొడ్డు నాగేంద్రం కుటుంబానికి 26 కేజీల బియ్యం బస్తా, క్లబ్ సభ్యులు మానేపల్లి సురేష్ సహకారంతో రూ.2000 నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు శేగు వెంకట ప్రసాద్, అతిథిగా మానేపల్లి సురేష్, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్లు శేగు బబిత, గాదె మోహన్ బాబు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానేపల్లి సురేష్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ అధ్యక్షులు తిరువీధి వేణుగోపాల్ పిలుపు మేరకు ప్రతి నెలా ఈ సేవా కార్యక్రమం కొనసాగుతోందన్నారు. సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

## పెద్దాపురం నియోజకవర్గంలో వైసీపీ నుండి జనసేనలోకి చేరికలు





కాకినాడ,అక్టోబర్ 12 (వార్తాప్రభ) : కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు,డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు నాయకత్వంలో పెద్దాపురం నియోజకవర్గంలో సామర్లకోట, పెద్దాపురం మండలాల్లో నుండి మాజీ సర్పంచులు, వైసీపీ కీలక నేతలు జనసేన పార్టీ లో చేరారు. సామర్లకోట మండలం నవర గ్రామం నుండి తాజా మాజీ సర్పంచ్ దమ్మల లక్ష్మణరావు, అతని అనుచరుడు నూకరాజు, పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి గ్రామం మాజీ సర్పంచ్ కురుమళ్ళ లోవరాజు , కురుమళ్ళ లక్ష్మణ్ దొర జనసేన పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు.ఈ మేరకు కాకినాడ విచ్చేసిన పవన్ కళ్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పవన్ కళ్యాణ్ వెంట కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ శాసన సభ్యులు పంతం నానాజీ ఉన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దాపురం పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జనసేన నాయకులు నక్కిండి సాయి ప్రసాద్ కోట పట్టణ అధ్యక్షులు దొమ్మేటి శ్రీనివాస్( సరోజ్ వాసు), పెద్దాపురం మండల యువత ఉప అధ్యక్షులు వెన్నా వెంకటేష్ పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమొక్రటిక్ వారి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి, తిరుపతి (జిల్లా) లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో గుడివాడ -శ్రీరాంపురం లోని శారదా వికాస్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ అర్జా ప్రసాద్, లక్ష్మీ దంపతులు రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గొల్లపూడి మోహన్ రావు, శ్రీకాళహస్తి డీఈఓ జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్, శ్రీ కాళహస్తి టెంపుల్ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మరియు కృష్ణా జిల్లా అధ్యక్షులు పుట్టి రామ చంద్రశేఖర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. -గుడివాడ,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :

## శ్రీ వెంకన్న స్వామి అన్న సమారాధన కార్యక్రమానికి రూ. 1,02,116/- విరాళం



గుడివాడ, అక్టోబర్ 12 (వార్తాప్రభ) : మరో చిన్న తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన పాటిమీద జగన్నాథపురం లో వేంచేసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ప్రతి శనివారం తలనీలాలు సమర్పించే భక్తులకు మరియు దూర ప్రాంతం నుంచి వచ్చే భక్తులకు నిర్వహించబడే అన్న సమారాధన కార్యక్రమమునకు సాఫ్ట్ వేర్ ఇంజనీర్ వీర్ల సాయి శివ, వెంకట శ్రావణ లక్ష్మీ దంపతులు శాశ్వత అన్నదానం నిమిత్తం రూ.92000/- అక్షరాల తొంబై రెండు వేల రూపాయల చెక్కును మరియు వారి కుమారుడు అయిన చి. జిష్ణు కార్తికేయ పేరు మీదుగా రూ.10116/- లు పదివేల నూట పదహారు రూపాయలు వెరసి రూ. 1,02,116/- లు ధర్మకర్తల మండల చైర్మన్ లింగం శివరామ ప్రసాద్ మరియు ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో అందజేసారని కార్యనిర్వహణాధికారి కందులు వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలియచేశారు. ఆలయ అర్చక స్వామి వేదాంతం అప్పలచార్యులు చే విరాళాధాతలకు శ్రీ స్వామి వారి దేవస్థానం యందు ప్రత్యేక పూజా కార్యక్రమంలు నిర్వహించి శ్రీ స్వామి వారి శేష వస్త్రము ప్రసాదము అందజేసియున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండల సభ్యులు చందు శ్రీనివాసరావు, నిమ్మగడ్డ కృష్ణారావు, గూడపాటి సుజాత, పంతంగి హేమ, వేదాంతం కృష్ణవేణి, రాజేశ్వరరావు, సాంబశివరావు మరియు దసరా వార్షిక కర్త అయిన యార్లగడ్డ జితేంద్రబాబు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**కుమార్తె పేరుతో అన్నదానానికి రూ.10 వేల విరాళం..** స్థానిక పాటిమీద జగన్నాథపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి శనివారం నిర్వహించే అన్న సమారాధనకు విరాళం అందింది. కంఠంనేని సాయిరాం, గణేష్ రేఖ చౌదరి దంపతులు తమ కుమార్తె చి. కంఠంనేని ఐరా పేరు మీద శాశ్వత అన్నదాన పథకానికి రూ. 10,000 విరాళాన్ని ధర్మకర్తల మండలి సభ్యులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ లింగం శివరాం ప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ చైర్మన్ పోటీలో విస్సన్నపేట మండల ఎన్నారై?



విస్సన్నపేట,అక్టోబర్ 12 (వార్తాప్రభ) : స్థానిక మండలానికి చెందిన ఎన్నారై జిల్లా పరిషత్ చైర్మన్ రేస్ లో ఉన్నట్లు విశ్వసినీయ వర్గాల సమాచారం అందుతుంది. ఆయన గత ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయానికి ఎండనక వాననక రాత్రి అనక పగలనకా పూర్తిస్థాయి కాలాన్ని హెచ్చించి తెలుగుదేశం పార్టీ గెలుపుకు మండలంలో అత్యధిక మెజార్టీ సాధించేందుకు దిక్కుతోచని మహాసముద్రంలో ఉన్న నావకు దిక్సూచి వలె త్రోవ చూపించి ప్రధాన భూమిక పోషించినట్లు సర్వత్రా వినిపిస్తుంది. ఎన్నికల ముందు ఆరు నెలలు నుండి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తూ వేలాది మందికి ఆర్థిక చేయూత ఇవ్వటంతో పాటు బడులు గుడులు దేవస్థానాలు చర్చిలు మసీదులు అభివృద్ధికి తన వంతు కృషి చేయటమే కాకుండా అనారోగ్యంతో ఉండి ఆర్థిక ఇబ్బందులలో ఉన్న వారికి చనిపోయిన కుటుంబాలకు దశదిన కర్మలకు ఆర్థిక సహాయం వివాహం కానీ తెలుగంటి ఆడపడుచులకు ఆర్థిక భరోసా తన వంతు ఆర్థిక చేయూత ఇవ్వటమే కాకుండా సాఫ్ట్వేర్ విద్యార్థులకు లాప్టాప్ అందించి తనదైన ముద్రను ఎన్నారై వేసి టిడిపి పార్టీ గెలుపుకు పోల్ మేనేజ్మెంట్ లో అపార అనుభవం కలిగిన రాజకీయ చాణక్యుల సలహా సంప్రదింపులతో వైరి వర్గాల గజకర్ణ గోకర్ణ టక్కు టమార విద్యలతో వారి ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ గెలుపే లక్ష్యంగా పనిచేసి విజయకేతనం ఎగరవేసిన ఎన్ఆర్ఐ జడ్పీ చైర్మన్ పోటీలో నల్లేరు పై నడకవలె విజయకేతనం ఎగరవేసే అవకాశం ఉంటుందని పలువురు అనుకుంటున్నారు.

## నూజివీడు ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించిన ఉన్నతాధికారులు



నూజివీడు,అక్టోబర్ 12 (వార్తాప్రభ) : ఏలూరు జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ బి.శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ కే.వి. నాగ ప్రభు కుమార్ ఆదేశాల మే-రకు, ఏలూరు జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శ్రీ సి.హెచ్. అజయ్ కుమార్ సింగ్ నూజివీడు ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని సమీక్షించి, దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా చార్జ్‌షీట్లను దాఖలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతను పాటిస్తూ, నిందితులకు చట్టప్రకారం శిక్షలు పడేలా అవసరమైన ఆధారాలను సేకరించాలని సూచించారు.అనంతరం స్టేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించి, స్టేషన్ పనితీరు, కేసుల పురోగతి, అక్రమ మద్యం తయారీ, నిల్వ, రవాణా మరియు విక్రయాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. నాటుసారా తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు, బెల్లం ఊట, తయారీ స్థావరాలు మరియు రవాణా మార్గాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నాటుసారా తయారీదారులకు ముడి పదార్థాలను సరఫరా చేసే వ్యక్తులను గుర్తించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గతంలో నాటుసారా తయారీకి పాల్పడిన వ్యక్తుల కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, నాటుసారా తయారీ తిరిగి పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన వారికి పునరావాస కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని, రెవెన్యూ, పోలీస్ మరియు ఇతర సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ అక్రమ మద్యం తయారీ, విక్రయాల నియంత్రణకు కృషి చేయాలని తెలిపారు.స్టేషన్ పరిధిలో నాటుసారా రహిత వాతావరణాన్ని కొనసాగించడంతో పాటు, పెండింగ్ కేసుల పరిష్కారం, పరారీలో ఉన్న నిందితుల గుర్తింపు, అరెస్టులు మరియు అక్రమ మద్యం నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఉన్నతాధికారి సిబ్బందికి సూచించారు.

## గిరిపురం లో అంగన్వాడీ సిబ్బందికి సత్కారం



పెడన,అక్టోబర్ 12 (వార్తాప్రభ) : సమగ్ర శిశు అభివృద్ధి పథకం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సోమవారం నాడు తాళ్లపాలెం సెక్టార్ పరిధిలోని గిరిపురం అంగన్వాడి లో ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ టీచర్ నిర్మలా రాణి ఆయా వాసంతి లను గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. తమను సత్కరించిన గ్రామస్తులకు అంగన్వాడీ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

## మండల టిడిపి కార్యాలయంలో మాగంటి నాని జన్మదినోత్సవ సంబరాలు



విస్సన్నపేట,అక్టోబర్ 12 (వార్తాప్రభ) : స్థానిక మండల టిడిపి కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు రాయల సుబ్బారావు పట్టణ టిడిపి అధ్యక్షులు కొంగల శ్రీనివాసరావు సంయుక్త సారథ్యంలో టిడిపి యువ నాయకులు మాగంటి నాని ( సత్యనారాయణ చౌదరి) జన్మదినోత్సవ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## గాయత్రీ దేవి రూపంలో దర్శనమిచ్చిన శ్రీ కనకదుర్గమ్మ



హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 12 (వార్తాప్రభ) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వీరవల్లిలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు గాయత్రీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ముందుగా భక్తుల గోత్రనామాలతో అమ్మవారికి కుంకుమార్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం అమ్మవారికి పుట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు కోడెబోయిన బాబి, రావి ఈశ్వర్, భక్తులు మాచినేని ప్రసాద్, లంక పద్మశ్రీ, వడ్డీ భవాని తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## స్కేటింగ్ పోటీల్లో రెండు రజత పథకాలు సాధించారు...



నూజివీడు,అక్టోబర్ 12 (వార్తాప్రభ) : నూజివీడలోని ఒర్కిడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండవ తరగతి చదువుతున్న పూర్వాంశి స్కంద, ఏలూరులోని SAAP స్కేటింగ్ రింక్‌లో నిర్వహించిన ఏలూరు జిల్లా స్థాయి ఇన్‌లైన్ స్కేటింగ్ పోటీలలో రెండు రజత పతకాలు సాధించి పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చింది. 6--8 సంవత్సరాల వయస్సు విభాగంలో పోటీపడిన ఆమె, రింక్-4 మరియు రింక్-5 విభాగాల్లో రజత పతకాలను గెలుచుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలలో ఏలూరు జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు ఆమె ఎంపికైంది. ఈ విద్యార్థిని పాఠశాల చైర్మన్ మేడా మోహన రావు, డైరెక్టర్లు డా. గొల్లపూడి రవిబాబు, మేడా శ్రీ హర్ష, దీప్తి, ప్రిన్సిపల్ అనూప్ శ్రీశైలం అభినందించారు.

## 40 ఏళ్ల తర్వాత..
### గుడివాడ మున్సిపల్ పీఠంపై బీసీ మహిళ !

గుడివాడ,అక్టోబర్ 12 (వార్తాప్రభ) : మున్సిపల్ చైర్మన్ పీఠం ఎవరికి దక్కుతుందనే ఉత్కంటకు రిజర్వేషన్ల ఖరారుతో తెరపడింది. గుడివాడ మున్సిపల్ చైర్మన్ స్థానం బీసి మహిళకు కేటాయించడంతో నాలుగు దశాబ్దాల తర్వాత మరోసారి మహిళ మున్సిపల్ పీఠాన్ని అధిరోహించే అవకాశం ఏర్పడింది. 1987లో కాంగ్రెస్ పార్టీకి చెందిన గుదే రంగనాయకమ్మ విజయం సాధించి మున్సిపల్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత సుమారు 40 ఏళ్లకు మళ్ళీ మహిళకు ఈ అవకాశం దక్కనుండటం విశేషం. ప్రస్తుతం బీసీ మహిళకు రిజర్వేషన్ ఖరారు కావడంతో గుడివాడ మున్సిపల్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు తెరపైకి రానున్నాయి. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో గుడివాడ మున్సిపల్ పీఠం బీసీ మహిళకు కేటాయించడం ప్రాధాన్యత సంతరించుకుంది. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా ఈ నిర్ణయం కీలకమని బీసి సామాజిక వర్గాల ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. మున్సిపల్ చైర్మన్ స్థానం బీసీ మహిళకు దక్కడంపై గుడివాడ పట్టణంలోని బీసీ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతుంది. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఏ పార్టీకి చెందిన అభ్యర్థి ఈ పీఠాన్ని అధిరోహిస్తారు. బీసి మహిళా చైర్మన్ గా బాధ్యతలు చేపట్టి పట్టణ అభివృద్ధిలో ఎలాంటి పాత్ర పోషిస్తారు అన్నది ఆసక్తికరంగా మారింది.

## కూటమి ప్రభుత్వంలో గుడివాడకు మహర్దశ
### -రూ.1.75 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



గుడివాడ,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :పట్టణంలోని 20, 23వ వార్డుల్లో రూ.1.75 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, పార్కు అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శంకుస్థాపన లు చేశారు. 20వ వార్డు బ్యాంక్ కాలనీలో రూ.60 లక్షలతో సీసీ రోడ్లు, ఆర్టీసీ కాలనీలో రూ.70 లక్షలతో పార్కు అభివృద్ధి, సత్యనారాయణపురంలో రూ.45 లక్షలతో రెండు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.. గుడివాడ అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, దీర్ఘకాలిక సమస్యలైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తున్నామన్నారు. ప్రధాన ప్రాంతాలతో పాటు కాలనీలు, శివారు ప్రాంతాల్లోనూ మౌలిక సదుపాయాల కల్పనకే ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంఈ సతీష్ చంద్ర, డిఈ శివాజీ, ఏఈలు రాజేష్, శ్రావణ్, సత్యనారాయణ లు పట్టణ టీడీపీ అధ్యక్షులు పంద్రాజు సాంబశివరావు, కూటమి నాయకులు లింగం ప్రసాద్, దింట్యాల రాంబాబు, గోర్జి సత్యనారాయణ, జాని షరీఫ్, సాయన రాజేష్, గుండు వెంకట్రావు, అర్కే, లింగం చిట్టిబాబు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా కూటమి ప్రభుత్వం..
### -75 కుటుంబాలకు రూ.60 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



గుడివాడ,అక్టోబర్ 12 (వార్తాప్రభ) : ఆపదలో ఉన్నవారికి అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో సీఎంఆర్ఎఫ్ ద్వారా బాధిత కుటుంబాలకు భారీగా ఆర్థిక సహాయం అందుతోందని తెలిపారు. స్థానిక ప్రజా వేదిక కార్యాలయంలో సోమవారం 75 మంది బాధిత కుటుంబాలకు రూ.60 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కూటమి నాయకులతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని, వారికి భరోసా ఇవ్వడమే సీఎంఆర్ఎఫ్ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గుడివాడ నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.8.40 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశామని, ఇది ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. లబ్ధిదారులు ఈ పథకంపై ఇతరులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రజల కోసం, రాష్ట్రం కోసం కష్టాన్ని ఇష్టంగా భరిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ప్రజలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, టీడీపీ అధ్యక్షులు పంద్రాజు సాంబశివరావు, వాసే మురళి, దానేటి సన్యాసిరావు, పోలవరపు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానానికి స్ఫూర్తిగా రంగారావు కుటుంబం
### -వాసవి జాగృతి క్లబ్ ఆధ్వర్యంలో 15వ నేత్రదానం



గుడివాడ,అక్టోబర్ 12 (వార్తాప్రభ) : చూపు లేని వారికి వెలుగు నింపే మహత్తర కార్యక్రమాన్ని వాసవి జాగృతి క్లబ్ కొనసాగిస్తోంది. గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామానికి చెందిన కొల్లిపర రంగారావు (80) ఆదివారం సాయంత్రం వృద్ధాప్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబం నేత్రదానానికి ముందుకు వచ్చింది. క్లబ్ సభ్యులు, మృతుని అల్లుడు అయిన సొలస వెంకట రత్నం చొరవతో కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వెంటనే నేత్రదాన ప్రోత్సాహకులు గాదె మోహన్ బాబుకు సమాచారం ఇవ్వగా, ఆయన ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ టెక్నీషియన్ సాయి సహకారంతో నేత్రాలను సేకరించారు. ఇది క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన 15వ నేత్ర సేకరణ.. ఈ సందర్భంగా డిప్యూటీ గవర్నర్ కొల్లిపర అనసూయ మాట్లాడుతూ "నేత్రదానం వల్ల వ్యక్తి భౌతికంగా మన మధ్య లేకపోయినా, మరొకరి కళ్ల ద్వారా జీవించి ఉంటారని" అన్నారు. మృతుని కుటుంబానికి క్లబ్ అధ్యక్షులు శేగు వెంకట ప్రసాద్, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ శేగు బబిత ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఓట్ల చోరీకి పాల్పడిన సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలి-బొర్రా కిరణ్

● ఢిల్లీలో జరుగుతున్న మహా పాదయాత్రకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి మైలవరం పట్టణంలో పాదయాత్ర చేసిన కిరణ్





**మైలవరం,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** ఓట్ల చోరీకి పాల్పడిన సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలనీ, జ్ఞానేష్ కుమార్ కు మద్దతు తెలియ చేస్తున్న ప్రధాని మోడీ, అమిత్ షా లు వెంటనే రాజీనామా చేయాలని ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్స్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ డిమాండ్ చేశారు.రాహుల్ గాంధీ నేతృత్వంలో ఢిల్లీలో జరుగు తున్న మహా పాదయాత్రకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి బొర్రా కిరణ్ మైలవరం పట్టణంలో పాదయాత్ర చేశారు. పట్టణంలోని గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాల కు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి పూలమాలలు వేశారు. అనంతరం బొర్రా కిరణ్ మాట్లాడుతూ దేశంలో 'ఓట్ల చోరీ'కి పాల్పడిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించి, ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని బొర్రా కిరణ్ అన్నారు.ఈ ఓట్ల చోరీ అంశంపై అక్టోబర్ 12వ తేదీ సోమవారం ఢిల్లీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మరియు ఇండియా కూటమి నాయకులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)జస్టిస్ సూర్యకాంత్‌ను కలిసి వినతిపత్రం సమర్పించడానికి పాదయాత్రగా వెళ్లారని తెలిపారు.ఈ సందర్భంగా జరుగుతున్న మహా పాదయాత్రకు మద్దతుగా మైలవరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టడం జరిగిందని వెల్లడించారు. మెట్రోలూ రద్దు చేయడం, ఇంటర్నెట్ నిలిపివేయడం మోదీ పిరికితనానికి నిదర్శనం అన్నారు. 13 కోట్ల ఓట్లను తిరిగి జాబితాలో చేర్చాలనీ,సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో త్రి-మాన్ కమిటీ నియమించి 2023చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజల ఓటు హక్కును కాపాడే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆపదని, సర్ ను రద్దు చేయాలని బొర్రా కిరణ్ డిమాండ్ చేశారు. ఓట్లు చోరులకు మద్దతుగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మరియు వైయస్ జగన్మోహనరెడ్డి ఉండటం సిగ్గుచేటు అని అన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడలిసిన వీళ్ళు పూర్తిగా మోడీకి ఆర్ ఎస్ ఎస్ కి లొంగిపోవటాన్ని చూసి ప్రజలు నవ్వు కుంటున్నా రని ఎద్దేవా చేశారు. ప్రధాని మోడీ, అమిత్ షా లను చూసి వీళ్ళు ఎందుకు భయపడుతున్నార ని బొర్రా కిరణ్ ప్రశ్నించారు.ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు శీలం రామకృష్ణ, యూత్ కాంగ్రెస్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూరు రవికుమార్ (సన్నీ ), దోసపాటి గిరి కుమార్, జిల్లా ర్ సెల్ చైర్మన్ భోజ్జగాని మురళి కృష్ణ, మసనం సుధాకర్, అన్నవరపు దుర్గారావు, గాలంకి సీతారాం, అక్కల నాగేంద్ర ప్రసాద్, రాగాల రాము, గొడవర్తి వెంకటేశ్వరరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేపర్ వ్యాపారుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం..

● సమస్యల పరిష్కారం, వ్యాపార అభివృద్ధి లక్ష్యం ● పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై .ఎల్ .కాంతారావు





**విజయవాడ,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** పేపర్ వ్యాపారుల సంక్షేమమే లక్ష్యంగా సమస్యలను పరిష్కరించి వ్యాపార అభివృద్ధే ధ్యేయం గా సేవలు అందిస్తానని ఎపి పేపర్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వై .ఎల్ కాంతారావు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ తొలి నిర్వహణ కమిటీ సమావేశం విజయ వాడలోని ఎం.జి. రోడ్డులోని ప్రైవేట్ హోటల్ సమావేశ మందిరంలో నిర్వహించారు సమావేశం లో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వై. లక్ష్మీ కాంతారావు మాట్లాడుతూ పేపర్ వ్యాపారుల సంక్షేమానికి సంబంధించిన నూతన కార్యవర్గం ప్రణాళికతో అడుగులు వేస్తుందని అన్నారు. పేపర్ వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయడం, ప్రభుత్వ శాఖలు మరియు సంబంధిత సంస్థలతో సమన్వయం పెంచడం, వ్యాపార పరంగా సభ్యులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించడం వంటి అంశాలపై దృష్టి సారింస్తామని చెప్పారు.పేపర్ వ్యాపారుల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించడంతో పాటు, వ్యాపార రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సభ్యులకు అవగాహన కల్పించడం, పరస్పర సహకారాన్ని పెంపొందించడం, సభ్యుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయడం వంటి అంశాలకు అసోసియేషన్ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు .సభ్యుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసు కుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు సంఘం మరింత చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సంఘాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేయడం, పేపర్ వ్యాపారులందరినీ సంఘటితం చేయడం, సభ్యుల సంక్షేమం కోసం అవసరమైన కార్యక్రమాలను రూపొందించడం వంటి అంశాలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సభ్యుల ప్రయోజనాలే అసోసియేషన్‌కు అత్యున్నత ప్రాధాన్యత అని నాయకత్వం స్పష్టం చేసింది.సామాజిక సేవలో భాగంగా ఇటీవల విజయవాడలోని ఏపీఎన్జీవోస్ స్టేట్ హోమ్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన సభ్యులకు సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. పేపర్ వ్యాపారుల సంక్షేమం ప్రధాన లక్ష్యంగా కొనసాగుతూనే, సమాజానికి అవసరమైన సందర్భాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. రాబోయే గోదావరి పుష్కరాల సందర్భంగా పుష్కర యాత్రికులకు సేవలందించే కార్యక్రమాలపై కూడా సమావేశంలో చర్చించారు. పుష్కరాల సమయంలో ప్రతిరోజూ సుమారు 10,000 మంది భక్తులకు భోజన సదుపాయం కల్పించే ఆలోచన పై చర్చించారు. కార్యక్రమం లో అల్ ఇండియా పేపర్ మర్చంట్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు వి.వి.డి. రమేష్ రాష్ట్ర కార్యదర్శి మఫత్ లాల్ జైన్ రాష్ట్రం లోని వివిధ జిల్లాలకు చెందిన కార్యవర్గ సభ్యులు పేపర్ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# కృత్తివెన్నులో నాగేశ్వరస్వామికి ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రత్యేక పూజలు



**గన్నవరం,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** దసరా ఉత్సవాలు, పవిత్ర సోమవారాన్ని పురస్కరించుకుని పెడన నియోజకవర్గం కృత్తివెన్ను లోని శ్రీ దుర్గా పార్వతీ సమేత శ్రీ నాగేశ్వరస్వామి, శ్రీ రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు దేవస్థాన చైర్మన్ చేకూరి వెంకట్రావు, కార్యనిర్వహణ అధికారి సింగనపల్లి శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో, వేద మంత్రోచ్చారణల నడుమ స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు గర్భగుడిలో స్వామివారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ స్వామివారి దివ్య కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చెన్నకేశవరావు, మండల కార్యదర్శి యాదవరెడ్డి కొండ, దేవస్థాన ట్రస్టు సభ్యుడు రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు అల్లూరి సత్యనారాయణ, ట్రస్ట్ బోర్డు సభ్యులు బాదిశ నాగబాబు, దాసరి శ్రీనివాస్ ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్తలు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# 17 అంశాల సమాచారం నోటీసు బోర్డులో ఏర్పాటు చేయాలని ఆర్‌టీఐ కార్యకర్తల ఫిర్యాదు..



**అవనిగడ్డ,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 21 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, చట్టాన్ని అమలు చేయాల్సిన రెవెన్యూ శాఖకు చెందిన కృష్ణా జిల్లా ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయంలోనే 4(1)(బి) సమాచారం అందుబాటులో లేకపోవడంపై ఆర్‌టీఐ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతను పెంపొందించి, ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంటున్నారు సమాచార హక్కు చట్టాన్ని భారత పార్లమెంట్ 2005 జూన్ 15న ఆమోదించగా, అదే ఏడాది అక్టోబర్ 12 నుంచి అమలులోకి తీసుకొచ్చారు అని ఈ చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన కీలక సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాల్సి ఉండగా చట్టం అమలులోకి వచ్చిన 120 రోజుల్లోగా ఈ సమాచారాన్ని ప్రచురించడంతో పాటు, సంబంధిత కార్యాలయాల నోటీసు బోర్డులపై కూడా ప్రదర్శించాల్సి ఉందని ఆర్‌టీఐ కార్యకర్తలు గుర్తుచేస్తున్నారు.

**17 అంశాల సమాచారం ఎక్కడ ?** సమాచార హక్కు చట్టంలోని 4(1)(బి) కింద ప్రభుత్వ కార్యాలయానికి సంబంధించిన మొత్తం 17 అంశాల సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఇందులో కార్యాలయ విధులు, బాధ్యతలు, అధికారుల అధికారాలు, ఉద్యోగుల వివరాలు, అమలు చేస్తున్న చట్టాలు, ఉద్యోగుల నెలవారీ వేతనాలు, బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులు, ప్రజా సమాచార అధికారుల పేర్లు, లబ్ధిదారుల వివరాలు తదితర అంశాలు ఉంటాయి అని ఈ సమాచారం ప్రభుత్వ వెబ్‌సైట్‌తో పాటు సంబంధిత కార్యాలయ నోటీసు బోర్డుపై కూడా అందుబాటులో ఉండాలని కార్యకర్తలు పేర్కొంటున్నారు. తద్వారా సామాన్య ప్రజలు తమకు అవసరమైన సమాచారాన్ని సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయంలో 4(1)(బి) కింద పొందుపరచాల్సిన సమాచారాన్ని నోటీసు బోర్డుపై ఏర్పాటు చేయాలని కోరుతూ శ్రీమతి ఎస్. కరుణ కుమారికి ఆర్‌టీఐ కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. చట్ట ప్రకారం ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సమాచారాన్ని కార్యాలయంలో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కోరారు ప్రభుత్వ కార్యాలయాల పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం పెరగాలంటే సమాచార హక్కు చట్టంలోని నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని వారు సూచించారు ఈ కార్యక్రమంలో ఆర్‌టీఐ కార్యకర్తలు జంపాన శ్రీనివాసగౌడ్, బేతపూడి జోగేశ్వరరావు, బి. దుర్గా ప్రసాద్, మరీదు సాంబశివరావు, బొల్లా శివపార్వతి, గుంజా హేమలత పాల్గొన్నారు.

# ఎనభై ఏళ్ల వృద్ధురాలు కళ్యం రామకోటమ్మ కన్నీటి ఆవేదన

● ఆస్తులు రాయించుకుని వృద్ధు రాలిని గెంటేసిన పెద్ద కోడలు, చిన్న కుమారుడు.

● ఆస్తులు తిరిగి అప్పగించి, జీవనానికి సహాయం చేయాలని ఆర్డీఓకు, ఎమ్మార్వో కు వినతి.



**అవనిగడ్డ,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** స్థిరచరాస్తులు స్వంతం చేసుకుని ఆపై ఎనభై ఏళ్ళ వృద్ధురాలిని ఇంటి నుంచి గెంటేసిన రక్తసంభంధీకుల ఘరానా మోసమిది. సభ్యసమాజం ఈసడించుకునేలా సొంత కుటుంబ సభ్యులే వృద్ధురాలి పట్ల నిర్దయగా వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.తీవ్ర చర్చనీయాంశమైన ఈ ఘటన కు సంబంధించిన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. ఉయ్యూరు మండలం బోళ్ళపాడు గ్రామానికి చెందిన 80 ఏళ్ల సీనియర్ సిటిజన్ కళ్యం రామకోటమ్మ తన కుమారులు, కోడలు ఆస్తులు రాయించుకుని ఇంటి నుంచి గెంటేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భర్త కళ్యం లక్ష్మారెడ్డి 07.05.2007న మృతి చెందగా, దంపతులకు కాటూరు గ్రామంలో రీ-సర్వే నంబర్లు 92/3, 390/1సి, 390/2, 390/3, 390/4, 394/1లో 10.50 ఎకరాల వ్యవసాయ భూమి, బోళ్ళపాడు గ్రామంలోని సర్వే నంబర్ 16/2లో డోర్ నంబర్ 5-103 వద్ద 10 సెంట్ల ఇంటి స్థలంలో ఆరు గదుల డాబా ఇల్లు ఉన్నాయని తెలిపారు. 2007 ఆగస్టు 22న తన ఇద్దరు కుమారులు కళ్యం ఆవలరెడ్డి, కళ్యం శ్రీనివాసరెడ్డి, కుమార్తె కొర్ల ధనలక్ష్మి కలిసి ఆస్తులకు సంబంధించి వాటాల జాబితా రాయించుకున్నారని, దీనికి రిజిస్టర్ డాక్యుమెంట్ నంబర్ 4425/2007గా నమోదు చేశారని రామకోటమ్మ పేర్కొన్నారు. అనంతరం కుమారులు వ్యవసాయ భూమిని స్వాధీనం చేసుకుని, కొంత భాగాన్ని విక్రయించడంతో పాటు మిగిలిన భూములను సాగు చేస్తూ వచ్చే ఆదాయాన్ని అనుభవిస్తున్నారని తెలిపారు పెద్ద కుమారుడు కళ్యం ఆవలరెడ్డి ఇంటిని స్వాధీనం చేసుకోగా, ఆయన మరణానంతరం భార్య కళ్యం సుధారాణి ఇంటిని స్వాధీనం చేసుకుని తనను ఇంటి నుంచి గెంటివేశారని రామకోటమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో రెండేళ్లుగా చిన్న రేకుల షెడ్డులో తలదాచుకుంటున్నానని, వయోభారం, అనారోగ్యంతో బాధపడుతున్న తనకు కుమారులు ఎలాంటి సహాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు తన ఆస్తులపై జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేసి, 10.50 ఎకరాల వ్యవసాయ భూమితో పాటు 10 సెంట్ల ఇంటి స్థలంలో ఉన్న ఆరు గదుల డాబా ఇంటిని తనకు తిరిగి స్వాధీనం చేయాలని కోరుతూ రామకోటమ్మ ఆర్డీఓ శ్రీమతి ఎస్. కరుణకుమారి, తహాశీల్దార్ ఎం. సురేష్‌కుమార్‌లకు వినతిపత్రం సమర్పించారు. ఆర్టీఐ కార్యకర్తలు జంపాన శ్రీనివాసగౌడ్, బేతపూడి జోగేశ్వరరావులతో కలిసి ఆమె అధికారులను కలిశారు. తనకు న్యాయం చేసి, వృద్ధాప్యంలో జీవించేందుకు అవసరమైన సహాయం అందించాలని రామకోటమ్మ విజ్ఞప్తి చేశారు.

# ఆర్థిక లావాదేవీల వివాదంతో ద్విచక్ర వాహనాలకు నిప్పు!

● ఈదులగూడెం మాజీ సర్పంచ్ ఇంటి వద్ద ఘటన.. ● ముగ్గురిపై పోలీసుల దర్యాప్తు

**ఆగిరిపల్లి,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఈ. వెంకట సుబ్బయ్య ఇంటి వద్ద పార్కింగ్ చేసి ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు, ఫర్నిచర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి నిప్పంటించిన ఘటన పై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 9వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై సీహెచ్. నాగరాజు ఆధ్వర్యంలో విచారణ చేపట్టిన పోలీసులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివాదాలే ఘటనకు కారణమని ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. బ్యాంకు రుణంతో పాటు 2024 ఎన్నికల సమయంలో బెట్టింగ్‌ల కోసం తీసుకున్న డబ్బుల చెల్లింపుల విషయంలో విభేదాలు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆవాల హేమంత్, పందు బోయిన మహేష్, తెల్ల శోభనాద్రి కలిసి ఇంటి ప్రాంగణంలోని రేకుల షెడ్డులో ఉన్న మోటార్‌సైకిల్, స్కూటీపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు పోలీసులు గుర్తించారని తెలిపారు. ఘటనకు సంబంధించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు ఆగిరిపల్లి పోలీసులు వెల్లడించారు.

# క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ ఆధ్వర్యంలో భారీ ఉచిత వైద్య శిబిరం






**గుంటూరు,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మాచర్ల రూరల్ గ్రామం, కొత్తూరులోని ఎమ్.పి.యు.పి పాఠశాలలో శనివారం ఒక భారీ ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరం ద్వారా కొత్తూరు, పసువేముల, మరియు తాళ్లపల్లి గ్రామాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమానికి క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ ఎస్. రంజన, వైస్ చైర్‌పర్సన్ బి. సుజాత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ శిబిరంలో సిద్ధార్థ మెడికల్ కాలేజీకి చెందిన నిపుణులైన జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిషియన్, గైనకాలజిస్ట్, కార్డియాలజిస్ట్, మరియు ఆప్తాల్మాలజిస్ట్ (కంటి వైద్యులు) రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 125 మంది గ్రామీణులు ఈ శిబిరాన్ని ఉపయోగించుకున్నారు. వైద్య శిబిరానికి వచ్చిన 125 మందికి ఉచితంగా షుగర్ మరియు బీపీ పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులను పంపిణీ చేశారు. వీరిలో అవసరమైన 40 మందికి ఈసీజీ పరీక్షలు కూడా చేశారు. ప్రముఖ కంటి వైద్య సంస్థ ఎల్. వి. ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 60 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయనున్నారు. అలాగే, తీవ్రమైన కంటి సమస్యలతో బాధపడుతున్న 5 గురికి ఉచితంగా క్యాటరాక్ట్ (శుక్లాల) ఆపరేషన్లు చేయించనున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్య సంరక్షణకు తమ వంతు కృషి చేస్తామని క్రాఫ్ట్స్ కౌన్సిల్ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొని సేవలు అందించిన వైద్య బృందానికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మరణించినా పదిమందికీ ఉపయోగపడేలా శరీరదానం

● సహకారసంఘ యూనియన్ నేత చంద్ర రవికి పితృవియోగం.





**చల్లపల్లి/అవనిగడ్డ,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** మరణించినా పదిమందికీ ఉపయోగపడేలా జన్మకు సార్థకత చేసుకున్నారు చంద్ర సూర్యనారాయణ. ప్రాణంపోయిన శరీరం పంచభూతాల్లో కలిసి పోకుండా వైద్యవిద్యార్థులకు ఉపయోగపడాలనే అభ్యుదయ భావాన్ని చాటిచెప్పారు. చల్లపల్లి మండలం మంగళాపురం గ్రామానికి చెందిన సహకారసంఘ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర నాయకులు, మంగళాపురం సొసైటీ సీఈవో చంద్ర రవికుమార్ తండ్రి చంద్ర సూర్యనారాయణ (84) అనారోగ్యంతో కన్నుమూశారు. వైద్యవిద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా కుమారులు రవి, వెంకటేశ్వరరావులు తండ్రి భౌతికకాయాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించేందుకు నిర్ణయించారు. విజయవాడ సమీపం లోని నిమ్రా మెడికల్ కళాశాల బృందం ఆదివారం ఉదయం మంగళాపురం వచ్చి భౌతికకాయాన్ని తీసుకు వెళ్లారు. ఆగస్టు నెలలో సూర్యనారాయణ సతీమణి రాజేశ్వరి మరణిం చగా, ఆమె చివరి కోరిక ప్రకారం కుటుంబ సభ్యులు నేత్రదానం, శరీరదానం చేసి ఆదర్శంగా నిలిచారు. రెండు నెలలకే తండ్రి మరణించగా, ఆ భౌతికకాయాన్ని సైతం వైద్యకళాశాలకు దానంచేశారు.

**సూర్యనారాయణకు ప్రముఖుల నివాళులు..** సూర్యనారాయణ భౌతికకాయాన్ని సీపీఐ ప్రముకులు, జనసేన పార్టీ సమన్వయకర్త మండలి వెంకట్రామ్ , సహకార సంఘ పెద్దలు, సీఈవోలు, యూనియన్ నేతలు, గ్రామస్థులు పెద్దఎత్తున సందర్శించి నివాళులు అర్పించారు. కుమారులను పరామర్శించి సానుభూతిని తెలియచేశారు.

# కోడూరు మండలంలో పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన అవనిగడ్డ సహాయ వ్యవసాయ సంచాలకులు జే.జయప్రద



**కోడూరు, అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** అవనిగడ్డ సహాయ వ్యవసాయ సహాయకులు జే జయప్రద మరియు కోడూరు మండల వ్యవసాయ అధికారి యం శ్రీధర్, కోడూరు మండలం లోని పలు ఎరువులు మరియు పురుగు మందుల దుఖాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా డీలర్లు తమ ఎరువుల లైసెన్సులో ఫారం ఓ నమోదు చేసుకోవడం లేదని, స్టాక్ రిజిస్టర్లు లో ఉన్నస్టాకు గోడౌన్ లో ఉన్న స్టాకు ట్యాలీ కావడం లేదని, పురుగుమందుల స్టాక్ రిజిస్టర్ లో ఉన్న స్టాకు బిల్లు పుస్తకంలో బిల్లులు రాసినస్టాకు ట్రాలీ కావడం లేదని , ఆన్లైన్ మరియు గోడౌన్ లో స్టాకు నిల్వలు ట్యాలి కానందుకు దాదాపు 83.250 మెట్రిక్ టన్నుల, రూ.17, 25,357/- విలువ గల ఎరువుల లనుస్టాప్ సేల్స్ జారీ చేయడం జరిగిందని తెలిపారు. అవనిగడ్డ సహాయ వ్యవసాయ సహాయకులు శ్రీమతి జే జయప్రద మాట్లాడుతూ డీలర్లు వెంటనే తమ ఫారం ఓ లను మరియు ఇతర తప్పులను వారం లోగా సరిదిద్దుకోవాలని ఆదేశాలిస్తూ, ఒకవేళ నిర్ణీత సమయంలో సరిచేసుకోకపోతే, స్టాకు సీజ్ చేయటం జరుగుతుందని తెలిపారు.

# వేలేరు పాల సంఘానికి అవార్డులు తెచ్చిన బాపారావు

● బాపారావుకు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ నివాళి



**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 12 (వార్తాప్రభ) :** వేలేరు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం మాజీ అధ్యక్షుడు, కృష్ణా మిల్క్ యూనియన్ మాజీ జిల్లా డైరెక్టర్ దోనవల్లి బాపారావు మృతి పాల ఉత్పత్తిదారులకు తీరని లోటని కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ డా. దాసరి వెంకట బాలవర్ధనరావు అన్నారు. సోమవారం వేలేరులో బాపారావు పెద్దకర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాపారావు కుమారుడు నాగమునీంద్రకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాపారావు సుదీర్ఘకాలం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడిగా సేవలందించి, ఉమ్మడి కృష్ణా జిల్లాలో అత్యధిక పాల ఉత్పత్తితో వేలేరు సంఘానికి పలు అవార్డులు సాధించారని బాలవర్ధనరావు కొనియాడారు. హనుమాన్ జంక్షన్ పాలశీతల కేంద్రం పరిధిలోని పాల సంఘాల అభివృద్ధికి, గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, వేములపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమా వరప్రసాద్, వేగిరెడ్డి పాపారావు, దోనవల్లి రామారావు, అవిర్నేని భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188